



ప్రభుత్వమే 104 వాహనాలు

నడపాలి

● ఉద్యోగుల డిమాండ్
● సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



నిరసన సాగిస్తున్న 104 ఉద్యోగులు

అనంతపురంటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమే పీహెచ్‌సీల ద్వారా 104 వాహనాలు నడపాలని, సిబ్బందికి ప్రతినెలా జీతాలు చెల్లించి ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ 104వాహనాల ఉద్యోగులు ఆదివారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంగమేష్ సర్కిల్ నుంచి ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు నాగమణి, నాగేంద్ర, 104ఉద్యోగుల సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం, శివకృష్ణ, ప్రవీణ్ తదితరులు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం 104 ఉద్యోగులు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కానీ జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతోందన్నారు. కాంట్రాక్ట్ సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడం వల్ల చిన్న చిన్నకారణాలకే వేధిస్తూ ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారన్నారు. అందుకే ప్రభుత్వమే పీహెచ్‌సీల ద్వారా 104వాహనాల సేవలను నిర్వహించాలని, కాంట్రాక్ట్ సంస్థ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనల మేరకు బెనిఫిట్స్ కల్పించి, వేతనాలు ప్రతినెలా ఒకటిన చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 104ఉద్యోగుల నాయకులు నరేష్,సాయి, మానస, షబానా తదితరులు పాల్గొన్నారు.



తప్పులతో తిప్పలు

భూ రీసర్వేతో కొలతల్లో భారీ వ్యత్యాసాలు

■ ఒకే ఎల్‌పీ నంబర్‌తో అనేకమందికి జాయింట్ ఖాతా
■ రెండేళ్ల నుంచి కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ
■ సమస్య పరిష్కారం కాక సతమతం





శింగనమల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జరిగిన తప్పులతో పలువురు రైతులు తిప్పలు పడుతున్నారు. అప్పట్లో భూ రీసర్వేలో జరిగిన తప్పులతో నేటికీ పలువురు రైతులు కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. భూ రీసర్వేతో కొలతల్లో భారీ వ్యత్యాసాలు వస్తున్నాయని రైతులు వ్యతిరేకించినా ప్రభుత్వం పట్టించుకోకుండా రీసర్వే కొనసాగించింది. రైతులకు ఎల్‌పీ నంబర్లతో భూహక్కు పుస్తకాలు జారీ చేసింది. అయితే ఇందులో ఎక్కువ మందికి ఎల్‌పీ నంబర్లలో జాయింట్‌లో సర్వే నంబర్ల ఇవ్వడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత రెండేళ్లుగా వీటిని సరి చేసుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈక్రమంలోనే ప్రభుత్వం నుంచి వ్యవసాయానికి వర్తించే సబ్సిడీలు అందక నష్టపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శింగనమల మండలంలో 11 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తి చేశారు. ఎల్‌పీ నంబర్లతో భూహక్కు పుస్తకాలు అందజేశారు. అయితే రీసర్వే తరువాత భూముల కొలతల్లో భారీగా వ్యత్యాసాలు రావడంతో ప్రతి గ్రామంలో రైతులు వ్యతిరేకించారు. దీంతో అధికారులు మీ భూముల కొలతల ప్రకారమే చేస్తామని చెప్పి సముదాయించారు. ఈక్రమంలోనే ఎక్కువ రైతులకు భూమి విస్తీర్ణం తక్కువగా ఉన్నా ఎక్కువగా వేసి భూహక్కు పుస్తకాలు ఇచ్చారు. అప్పటి నుంచి రైతులు తమ భూముల వివరాలు సక్రమంగా ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు మాత్రం ఈనెల రేపు నెల అంటూ కాలం గడపడం తప్ప ఇప్పటి వరకు ఒక సమస్యను పరిష్కరించలేదు.

అందుబాటులో లేని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్

ప్రతి మండలంలో రీసర్వే పనులకు ఒక రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కేడర్ అధికారిని నియమించారు. రీసర్వేలో జరిగిన తప్పులను ఈయన లాగిన్‌లోనే సరి చేయాలి. అయితే గత ఆరు నెలల నుంచి శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో ఆ అధికారి అందుబాటులో లేడు. కనీసం ప్రతి సోమవారం జరిగే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)కు రావడం లేదు. గతంలో కూడా రీసర్వే కోసం జరిగిన గ్రామ సభల్లో మూడింటికి మాత్రమే హాజరయ్యాడు. ఎక్కువ తప్పులు జరిగిన గ్రామాల్లోని సభలకు అస్సలు వెళ్లలేదు. ఈక్రమంలోనే నిదనవాడ గ్రామ సభకు అధికారి రాలేదని రైతులు సభను బహిష్కరించారు. ప్రతి సోమవారం పదుల సంఖ్యలో రైతులు రీసర్వే సమస్యలపై వస్తున్నా అధికారి అందుబాటులో లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు.

ఒకే ఎల్‌సీ నంబర్‌తో 60 మంది రైతులు

రీసర్వే అనంతరం మండలంలోని ఆకులేడు రెవెన్యూ పొలంలోని సర్వే నంబర్ 501లో 7.07 భూమికి ఒక ఎల్‌సీ నెంబర్ కేటాయించారు. ఇందులో 60 మంది రైతు పేర్లు పొందుపరుస్తు జాయింట్‌గా భూహక్కు పుస్తకాలు అందజేశారు. దీంతో భూక్రయవిక్రయాల సమయంలో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈసమస్యను పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. ఇలా మండలంలో వందల సంఖ్యలో జాయింట్ సమస్యలతో రైతులు ఇబ్బందిపడుతున్నారు.

వ్యవసాయ పరికరాల సబ్సిడీకి ఇబ్బంది

భూ రీసర్వేతో విస్తీర్ణం కొలతల్లో తేడాలు రావడంతో రైతులు ప్రభుత్వం నుంచి అందే పలు సబ్సిడీలు కోల్పోతున్నారు. నిబంధనల మేరకు రైతుకు ఉండవలసి భూములు తక్కువగాను ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వం బిందు, తుంపర్ల సేద్యం పరికరాలకు ఇచ్చే 50, 75, 90 శాతాల సబ్సిడీని కోల్పోతున్నారు. ఒక రికార్డులో 20 ఎకరాలు విస్తీర్ణం ఉంటే మరో రికార్డులో 30 ఎకరాలు విస్తీర్ణం చూపుతోందని దానితో ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు కోల్పోతున్నామని రైతులు వాపోతున్నారు.

ఆప్షన్ రాగానే పరిష్కరిస్తాం

రీసర్వే గ్రామ సభలో సమస్యలున్న రైతుల నుంచి ఇప్పటికై ఆర్జీలు తీసుకున్నాం. భూ కొలతల్లో వ్యత్యాసాలు, జాయింట్ నంబర్ల సమస్యలపై గ్రామాల్లో సర్వేయర్లతో పనులు చేయిస్తున్నాం. రీసర్వే నంబర్ల సవరణకు ఆప్షన్ రాగానే రైతుల సమస్యను పరిష్కరిస్తాం.

\- సాకే బ్రహ్మయ్య, తహసీల్దార్, శింగనమల



నాభూమిని మరో రైతు డి పట్టాలోకి వేశారు: ఈ.లక్ష్మీనారాయణ, జూలాకాల్వ

నాకు జూలాకాల్వ రెవెన్యూ పొలం సర్వే నంబర్ 95లో 9.35 ఎకరాలు ఉంది. ఆ భూమి నాకుమారులు, కుమార్తెల పేరిట ఆన్‌లైన్‌లో ఉంది. అయితే రీసర్వే తరువాత ఈసర్వే నంబర్‌కు సంబంధించిన 89 సెంట్లను సర్వేనంబర్ 96 డి పట్టాలో కలిపారు. దీని పరిష్కారం కోసం గత రెండేళ్ల నుంచి అధికారి చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే సమస్యలు పరిష్కరించే అధికారి అందుబాటులో లేడు. ఫోన్ చేసిన లిఫ్ట్ చేయడం లేదు. మాసమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందో?



అధికారుల స్పందన లేదు: తలారి సూర్యనారాయణ, ఇరువెందల

రాచేపల్లి పొలంలో485-2లో 3.64 ఎకరాలు, 485-3లో 3.16 ఎకరాలు భూమి ఉంది. రీసర్వే సమయంలో మాకు ఉండవలసిన 6.80 భూమిలో 48 సెంట్లు తక్కువ చూపి అధికారులు భూహక్కుల పుస్తకం ఇచ్చారు. దాన్ని సరి చేసి 48 సెంట్లు చేర్చాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందనలేదు.



బ్యాంకు రుణం వెనక్కు కట్టమని ఒత్తిడి: దాసరి గంగాధర్, నాగులగుడ్డం

మాకు చెన్నవరం రెవెన్యూ పొలంలో సర్వేనంబర్ 77లో 4.45 ఎకరాలు ఉండగా 3.19 ఎకరాలు, 79 సర్వే నంబర్‌లో 10.14 ఎకరాలకు 9 ఎకరాలు ఉన్నట్లు చూపి భూహక్కుపుస్తకం ఇచ్చారు. రెండు సర్వే నంబర్లలో 2.4 ఎకరాలు తక్కువగా ఉంది. ఈక్రమంలో బ్యాంకులో తీసుకున్న పంట రుణం రెన్యువల్‌కు వెళితే అక్కడి అధికారులు ఆన్‌లైన్‌లో ఉన్న భూమి కంటే మీకు ఎక్కువ రుణం ఇచ్చామని, తీసుకున్న రుణం వెనక్కి కట్టమని ఒత్తిడి చేస్తున్నారు. సమస్య పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని కావడంలేదు.

శివరామిరెడ్డి కాలనీలో భూఆక్రమణ
ఎక్స్‌కవేటర్‌తో ముళ్ల చెట్ల తొలగింపు
రూ.కోటి విలువైన స్థలం కబ్జాకు సిద్ధం



గురుకుల పాఠశాల పక్కన ఖాళీ స్థలంలో ముళ్ల పొదలను తొలగించిన దృశ్యం

శివ శివా..!

ఉరవకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూములకు విలువ పెరగడంతో ఎక్కడైన ఖాళీ స్థలం కనబడితే చాలు ఆక్రమించేస్తున్నారు. ఇటీవల కాలంలో ఉరవకొండలో స్థలాలకు రేట్లు భారీగా పెరిగాయి. దీంతో కొన్ని రోజులు ఏ కొంచెం ఖాళీ స్థలం కనబడినా కబ్జాదారులు వాటిని ఆక్రమించుకుంటున్నారు. అందుకు నిదర్శనమే ఉరవకొండలోని శివరామిరెడ్డి కాలనీ గురుకులం పాఠశాల సమీపంలో ఉన్న స్థలం. ఇటీవల ఆక్రమణ దారులు స్థలంలో ఉన్న ముళ్ల చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి, శుభ్రంగా చదును చేశారు. ఆ స్థలం విలువ రూ.కోటి దాకా ఉంటుంది.

టీడీపీ పాలనలో పట్టాల పంపిణీ

2003లో టీడీపీ హయాంలో ఆ కాలనీలో పేదలకు 1120 దాకా పట్టాలను పంపిణీ చేశారు. అయితే అందులో కొంత ప్రాంతం నివాసయోగ్యం కాదని రెవెన్యూ అధికారులు నిర్ధారించడంతో అప్పట్లో ఇచ్చిన పట్టాలను రద్దు చేశారు. సర్వే నెంబర్ 556లో ఉన్న మూడెకరాల స్థలంలో కొంత భాగంలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను నిర్మించారు. మిగిలిన కొంత భూమిని ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాంలకు కేటాయించారు. ఇందులో రెండు భవన నిర్మాణాలు చేపట్టారు. ఇంకా మిగిలిన 50సెంట్లలో 25సెంట్లను ఎక్సైజ్ స్టేషన్‌కు కేటాయించగా, ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో నాలుగు రోజుల కిందట ఆ స్థలంలో ఉన్న ముళ్ల చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి శుభ్రం చేశారు. అక్కడ సెంటు ధర రూ.3లక్షల దాకా ఉంది. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న భూమిని ఆక్రమించుకునేందుకు కబ్జాదారులు రంగం సిద్ధం చేశారు. అలాగే సర్వే నెంబర్ 552/1లో వంక పక్కన కబ్జాదారులు భూమిని చదును చేశారు. శివరామిరెడ్డి కాలనీలో విచ్చలవిడిగా కాజేసి వాటికి దొంగ పట్టాలు, పొజీషన్ సర్టిఫికెట్లు సృష్టించి స్వాధీనం చేసుకుని విక్రయించడానికి తతంగం జరుగుతోంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా సర్వే నెంబర్ 556లో ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాంతో పాటు, ఎక్సైజ్ స్టేషన్‌కు కేటాయించామని తెలిపారు. అక్కడ ఎవరికీ ఎలాంటి పట్టాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



వంక పక్కన ఖాళీ స్థలాన్ని చదును చేసిన దృశ్యం

హంద్రీనీవా కాలువ



కదిలిన హంద్రీనీవా కాలువ వెడల్పు ఫైలు

అంచనాల తయారీకి ఆదేశించిన ప్రభుత్వం
సీజన్ ముగిసిన వెంటనే పనులు చేపట్టడానికి కసరత్తు
3,850 క్యూసెక్కులు పారేలా సిద్ధం చేయడమే లక్ష్యం

లక్ష్యం నెరవేరేనా..?

గుంతకల్లు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పు పనుల ఫైలును ఇంజనీరింగ్ అధికారులు కదిలించారు. కొత్త అంచనాలను తయారు చేసే పనిలో పడ్డారు. ఇటీవల అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం హంద్రీనీవా కాలువ వెడెల్పు ప్రాజెక్టుపై దృష్టిసారించింది. హంద్రీనీవాను వెడల్పు చేయడం, అవసరమైతే లైనింగ్ చేయడం. ఈ లక్ష్యానికి అనుగుణంగా 3,850 క్యూసెక్కులు పారేలా కాలువను సిద్ధం చేయడమా? లేక కాలువను వెడల్పు, లైనింగ్ చేసి 6,300 క్యూసెక్కులు పారేలా చేయడమా అనే విషయంగా సలహాలు, అంచనాలను సిద్ధం చేయాలంటూ ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు పంపింది. ఈ మేరకు ఇంజనీరింగ్ అధికారులు ఎస్టిమేషన్ల తయారీ పనుల్లో పడ్డారు. ఫిబ్రవరికల్లా అంచనాలను సిద్ధంచేసి ప్రభుత్వానికి సమర్పించడం, ప్రభుత్వ నిర్ణయం మేరకు హంద్రీనీవాలో నీటిపారుదల నిలిచిపోయిన తర్వాత మే నెలకల్లా పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టారు.

అదే మొదటి లక్ష్యం

హంద్రీనీవాను పూర్తిచేయడానికి 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 3,850 క్యూసెక్కులు పారేలా కాలువను నిర్మించడానికి పథకాన్ని సిద్ధం చేసింది. 2013లో హడావుడిగా కాలువ నిర్మాణాన్ని పూర్తిచేసి ట్రయల్ రన్ చేశారు. కానీ లక్షిత 3,850 క్యూసెక్కులు పారేలా కాలువ లేకపోవడంతో ఆ మోతాదులో నీటిని పారించలేకపోయారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ 3,850 క్యూసెక్కులు పారేలా తొలిదశలో మల్యాల పంప్‌హౌస్ నుంచి జీడిపల్లి రిజర్వాయరు వరకూ కాలువను వెడల్పు చేయడానికి చర్యలు చేపట్టింది. 2017లో చంద్రబాబు తన పుట్టిన రోజున పామిడిలో వైడెనింగ్ పైలాన్‌ను ఆవిష్కరించారు. ఆ తర్వాత 2019లో 6,300 క్యూసెక్కుల నీరు పారేలా కాలువను వెడల్పు చేయడానికి యత్నించారు. అయితే ఈలోగా ఎన్నికలు రావడం, అధికార మార్పిడి జరగడం చకచక జరిగిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి మూడున్నరేళ్లు కాలువ వెడల్పు పనుల జోలికెళ్లకుండా తాత్సారం చేశారు. తర్వాత దాదాపు వెయ్యి క్యూసెక్కులు పారేలా కాలువను వెడల్పు చేయడానికి వైసీపీ ప్రభుత్వం టెండర్లను పిలిచింది. కానీ తర్వాత ఆ ఫైలును అటకెక్కించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైడెనింగ్ ప్రాజెక్టును చేపట్టడానికి చర్యలు చేపట్టింది. 2004లో కాలువను రూపకల్పన చేసినప్పుడు 3,850 క్యూసెక్కుల నీరును పారించడం తొలి ప్రాధాన్యంగా నిర్ణయించి, ఆనాటి లక్ష్యాన్ని సాధించడమే టార్గెట్‌గా పెట్టుకుని అధికారులకు ఆదేశాలు పంపారు.

అంచనాల తయారీలో అధికారులు

హంద్రీనీవా కాలువ వెడల్పు విషయంగా జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆ శాఖ అధికారులతో గత నెలలో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. హంద్రీనీవా కాలువలో 3,850 క్యూసెక్కుల నీరు పారించడానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తోందని అధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు అంచనాలను, అవసరమైతే 6,300 క్యూసెక్కుల నీరు పారించడానికి ఎంత బడ్జెట్ అవుతుందన్న విషయంగా ఎస్టిమేషన్లను ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. ఈ మేరకు కాలువను వెడల్పు చేయడమా? లేక ఉన్న కాలువకు లైనింగ్ చేయడమా? అనే విషయంగా అధికారులు అంచనాలను సిద్ధం చేసే పనుల్లో పడ్డారు. 6,300 క్యూసెక్కులు పారించాలంటే ఇప్పుడున్న పంపులను రెట్టింపు చేయడం, కాలువను వెడల్పు చేయడంతో పాటు లైనింగ్ చేయాల్సి ఉంటుంది. 3,850 క్యూసెక్కులు పారించడానికి ప్రస్తుతం పని చేయని పంపులను సిద్ధం చేయడం, కాలువను విస్తరించడం లేదా లైనింగ్ చేయడం అనే అప్షన్లతో అంచనాలను తయారు చేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. 2024-25 సీజన్‌లో నీటి పారుదల నిలిచిన వెంటనే పనులు ప్రారంభించడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు కనబడుతోంది.

డెప్యుటేషన్ల కలకలం!

ఫిర్యాదుతో లోతుగా దర్యాప్తు
ఆరునెలల ముఖహాజరు సేకరణ
జిల్లా వైద్యాధికారుల్లో వణుకు

విచారణ చేపట్టిన కడప ఆర్డీ రామగిడ్డయ్య (ఫైల్)



అనంతపురంటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అక్రమ డెప్యుటేషన్ల వ్యవహారం వైద్యశాఖలో తీవ్ర కలకలం రేపుతోంది. అనేకమందిని నిబంధనలకు విరుద్ధంగా ఆఫీస్‌లో పెట్టుకొని కార్యకలాపాలు సాగిస్తున్నారని, దీనివెనుక పెద్దఎత్తున ఆర్థిక లావాదేవీలు జరిగాయని, అందుకే చాలామంది డెప్యుటేషన్‌లో ఉంటూ జిల్లా ఆఫీస్‌లోకూడా విధులకు హాజరుకాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్రశాఖకు ఫిర్యాదులు అందాయి. దీంతో రాష్ట్రవైద్యశాఖ అధికారులు సీరియస్‌గా స్పందించారు. ఈక్రమంలో జిల్లా కార్యాలయంలో ఉన్నోళ్లను వెంటనే వారి ఇంతకు ముందు స్థానాలకు పంపించారు. అక్రమ డెప్యుటేషన్ల వ్యవహారంపై విచారణకు కడప ఆర్డీని నియమించగా ఆయన విచారణ చేసి వెళ్లారు. ఆరోజు ఇక్కడ ఎవరూ డెప్యుటేషన్లలో లేరని ఏవైనా పథకాల పనులు ఉన్నపుడు కొందరిని పిలిపించుకొని పనులు చేయించుకుంటున్నామని జిల్లా వైద్యాధికారులు విచారణాధికారికి సమాధానం ఇచ్చి పంపారు. అయినా రాష్ట్ర వైద్యాధికారులు దీనిపై మరింత లోతుగా విచారణకు దిగడంతో జిల్లా వైద్యాధికారుల్లో కలవరం మొదలైంది.

ఆరు నెలల ముఖహాజరు సేకరణతో టెన్షన్

జిల్లా వైద్యాధికారులు చెప్పిన సమాధానాలకు, తమకు వచ్చిన ఫిర్యాదులకు ఎక్కడా పొంతన కుదరకపోవడంతో దర్యాప్తును మరింత లోతుగా చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. ఇతర పీహెచ్‌సీలలో పనిచేస్తున్న దాదాపు 40మందికి పైగా సిబ్బందిని డెప్యుటేషన్ పేరుతో వైద్యశాఖ కార్యాలయంలో నియమించుకున్నారనేది ప్రధాన ఆరోపణ. ఫిర్యాదులు వెళ్లడంతో వారందరినీ వారి పీహెచ్‌సీలకు పంపించేశారు. ఫిర్యాదులపై విచారణ చేయడానికి జిల్లాకు వచ్చిన అధికారి రామగిడ్డయ్య స్థానిక అధికారులు చెప్పిన విషయాల నివేదికను రాష్ట్ర అధికారులకు పంపారు. డెప్యుటేషన్ల వ్యవహారంలో జిల్లా వైద్యాధికారులు డ్రామా ఆడుతున్నారని రాష్ట్ర అధికారులు గ్రహించారు. దీంతో తమకు అందిన ఫిర్యాదు మేరకు డెప్యుటేషన్‌లో ఉన్నవారు గత ఆర్నెళ్ల నుంచి రోజువారి ముఖహాజరు ఎక్కడ వేశారనే వివరాలు పంపాలని విచారణాధికారిని ఆదేశించినట్లు చెబుతున్నారు. దీంతో ఇంతవరకు జిల్లా ఆఫీస్‌లో డెప్యుటేషన్ పేరుతో ఉన్నవారందరూ దొరికిపోతున్నారు. ఈవ్యవహారం చివరకు డీఎంహెచ్‌ఓ మెడకు చుట్టుకుంటోందని ఆశాఖ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

డెప్యుటేషన్‌పై ఎవరూలేరు

మా శాఖలో నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరినీ డెప్యుటేషన్‌పై నియమించలేదు. ఎప్పుడైనా ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు నిర్వహణ ఉంటే కొంతమందిని పిలిపించుకొని పని చేయించుకున్నాం. అదికూడా తాత్కాలికంగానే. ఇదేవిషయం విచారణాధికారికి తెలియజేశాం. ఓవ్యక్తి పనిగట్టుకొని తాను పనిచేయకుండా మాపై బురదవేయడానికి ఇలాంటి తప్పుడు ఫిర్యాదులు చేశారు. జిల్లా కలెక్టరు దృష్టికి ఆయన విషయం ఆధారాలతో తీసికెళ్లాం.

\- డాక్టర్ ఈబీదేవి, డీఎంహెచ్‌ఓ

అంతా పచ్చదనమే..!


పచ్చదనంతో కూడిన చెట్లు

'ఉపాధి' ద్వారా పల్లె వనాల అభివృద్ధి
పశుగ్రాసం పెంపకానికి చేయూత
ప్రతి మండలంలో అమలుకు ప్రభుత్వం శ్రీకారం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పల్లెవనాలు (సహజఅడవులు), పశుగ్రాసం పెంపకాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉపాధి జాబ్‌కార్డు ఉన్నవారి స్థలాల్లో పశుగ్రాసం పెంపకం చేపట్టనున్నారు. ఇక ప్రతి మండలంలో ప్రభుత్వ భూముల్లో పల్లెవనాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కనీసం 0.25ఎకరాల నుంచి ఎకరం విస్తీర్ణంలో ఈ పల్లెవనాలను అభివృద్ధి చేయనున్నారు. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు పూర్తి బాధ్యత ఆయా మండలం ఎంపీడీఓలు, ఉపాధి పథకం ఏపీడీలు, ఏపీఓలు తీసుకుంటారు.

1000 ఎకరాల్లో పశుగ్రాసం సాగు...

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద వెయ్యి ఎకరాల్లో పశుగ్రాసం పెంపకాన్ని చేపట్టనున్నారు. ప్రతి మండలంలో 25-35 ఎకరాల్లో పశుగ్రాసం సాగుచేయనున్నారు. పాడి ఉత్పత్తుల పెంపే లక్ష్యంగా బహువార్షిక గడ్డిజాతి పెంపకాన్ని చేపట్టనున్నారు. ఉపాధి పథకం కింద జాబ్‌కార్డు, పాడిపశువులు, బోరుబావి, నీటి సదుపాయం ఉన్నవారు పశుగ్రాసం సాగు చేసుకోవచ్చు. ఒక్కో రైతుకు కనీసం 10సెంట్ల నుంచి అర ఎకరా వరకు పశుగ్రాసం పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. వీరికి రెండేళ్ల పాటు పశుగ్రాసం పెంపకానికి అయ్యే ఖర్చును ఉపాధి పథకం కింద చెల్లిస్తారు. రైతుపేరు, భూమి పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డులతో సమీపంలోని ఉపాధి సిబ్బంది ద్వారా పశుగ్రాసం పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.



రెండు పనులు ఉపాధి కింద చేపడతాం



ఉపాధి పథకం కింద పచ్చదనం పెంపునకు పల్లెవనాలు, పాడిఉత్పత్తి పెంపునకు పశుగ్రాసం పెంపు పథకాన్ని అమలు చేస్తున్నాం. జిల్లాలో అర్హత కలిగిన ఉపాధి జాబ్‌కార్డుదారులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవచ్చు. పశుగ్రాసం పెంపకానికి రెండేళ్ల పాటు ఉపాధి పథకం కింద నిధులు చెల్లిస్తాం. ఇక పల్లెవనాలు పెంపునకు కూడా ఉపాధి పథకం కింద నిధులు చెల్లిస్తారు.
-సలీం బాషా, డ్వామా పీడీ

పేకాటలో పట్టుబడిన వైసీపీ నాయకులు

ధర్మవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ లాడ్జ్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 10 మంది వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. దుర్గమ్మగుడి సమీపంలో ఓ లాడ్జ్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 10 మంది వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.59 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని, సొంత పూచీకత్తుపై వైసీపీ నాయకులను వదిలిపెట్టారు.

26నుంచి డిగ్రీ మెగా సప్లిమెంటరీ

అనంతపురం సెంట్రల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్థులకు 26నుంచి మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2015నుంచి సెమిస్టర్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ కోర్సు మూడు సంవత్సరాల వ్యవధిలో సబ్జెక్టులు పాస్‌కాని విద్యార్థులు మరో మూడేళ్లలో పూర్తిచేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వివిధ కారణాల రీత్యా అనేకమంది విద్యార్థులు సబ్జెక్టులు పెండింగ్‌లో పెట్టుకున్నారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని ఈనెల 26 నుంచి డిసెంబరు 23వరకు మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఫీజులు చెల్లించిన ప్రతి విద్యార్థి పరీక్షలకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు వారి కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

రైతును ముంచిన మొక్కజొన్న

▼ రోడ్డు మీద పంటను ఆరబెట్టిన రైతులు ▼


శింగనమల నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వేరుశనగ సాగుతో విసిగిపోయిన రైతులు ప్రత్యామ్నాయంగా సాగు చేసిన పంటలతోనూ నష్టపోతున్నారు. శింగనమల మండలంలో నిరంతరం వేరుశనగ సాగుచేసే రైతులు మొక్కజొన్న పంట సాగుచేశారు. దిగుబడి బాగానే వచ్చింది. కానీ ధరలు భారీగా పడిపోవడంతో పెట్టుబడులు కూడా వస్తాయో రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 1000 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగు చేశారు. పంట సాగు చేసే సమయంలో క్వింటా ధర రూ3,500 పలికింది. ప్రస్తుతం క్వింటా రూ.2300 నుంచి 2500 వరకు వ్యాపారులు అడుగుతున్నారు. దిగుబడి వచ్చినా ధర తగ్గిపోవడం, నిల్వ చేసుకోవడానికి వీలులేకపోవడంతో కొందరు రైతులు ఉన్న ధరకే అమ్ముకుంటున్నారు. ఏ పంటలు సాగు చేసినా చివరికి నష్టాలే మిగులుతున్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి ఆశాజనకం.. ధరలు పతనం



ఈసారీ నష్టాలే : వెంకటరెడ్డి, చిన్నజలాలపురం

నేను ప్రతి సంవత్సరం వేరుశనగ పంట సాగు చేస్తుండేవాడిని. ఈసారి మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. 50 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. పంట కోసం ఇప్పటికే రూ.2లక్షలు ఖర్చు చేశాను. పంటను అమ్మిన రూ.లక్షన్నర లోపే వస్తుంది. ఈసారీ నష్టాలే మిగిలాయి.

దిగుబడి ఉన్నా.. ధర లేదు : రామాంజనేయులు, శింగనమల



నేను నాలుగు ఎకరాల్లో పంట సాగు చేశాను. మా పొలం చెరువు ప్రాంతంలో ఉంది. మూడు నెలల పాటు పంటను అడవి పందుల బారి నుంచి రాత్రింబవళ్లు కష్టపడి కాపాడుకున్నాను. దిగుబడి బాగానే ఉన్నా ధర తగ్గిపోవడంతో కొనుగోలు చేసేవారు రాలేదు. గత్యంతరం లేక పంటను గ్రామంలోని దేవాలయం వద్దనే ఆరబెట్టుకున్నా.

గిట్టుబాటు ధర ఏదీ..?



మొక్కజొన్న పంటకు ధరలు పడిపోవడంతో చాలా మంది రైతులు పొలాల్లోనే పంటలను పెట్టుకున్నారు. క్వింటాపై రూ.1000 తగ్గడంతోపాటు పంట కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడంలేదు. ప్రభుత్వం మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. - మధుయాదవ్,
రైతు సంఘం, నియోజకవర్గ అధ్యక్షుడు

ఎస్టీ కమిషన్ అదేశాలు

అమలు చేయాలి

ఏబీఎస్‌ఎస్ సెక్రెటరీ చక్రినాయక్

అనంతపురం సెంట్రల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బంజారాల అభివృద్ధికి 2019లో జాతీయ ఎస్టీ కమిషన్ విడుదల చేసిన ఆదేశాలను అమలు చేయాలని అఖిల భారత బంజారా సేవా సంఘం (ఏబీఎస్‌ఎస్) రాష్ట్ర కార్యదర్శి బానోత్ చక్రినాయక్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధిలో భాగంగా సెల్‌ఫోన్ల వినియోగం పెరిగిందన్నారు. బంజారాల నివాసప్రాంతాలైన తండాలలో సెల్‌టవర్లను ఏర్పాటు చేయకపోవడంతో సిగ్నల్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బంజారాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఏబీఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. దీంతో 2019లో రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గత ఐదేళ్లలో కమిషన్ ఆదేశాలు మరుగున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం కమిషన్ ఆదేశాలు అమలు చేసి బంజారాల అభివృద్ధిలో భాగం కావాలని విజ్ఞప్తిచేశారు.

విద్యారంగాన్ని సరిదిద్దాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ఎస్ ప్రసాద్

యాప్‌ల భారం తగ్గించాలి
యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్
ఘనంగా స్వర్ణోత్సవ మహాసభలు

కదిరి అర్బన్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): అస్తవ్యస్తంగా, గందరగోళంగా మారిన విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం సరిదిద్దాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. కదిరి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు పరచిన 117 జీఓ ఫలితంగా విద్యారంగం అస్తవ్యస్తంగా తయారయిందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా, సమయాన్ని యాప్‌ల పనిభారంతో, ఆన్‌లైన్‌వర్క్‌తో వృథా చేస్తోందన్నారన్నారు. 1 నుంచి 5, 6 నుంచి 10 లేక ప్లస్2 వరకు ఉండేలా పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అపార్ పనిని సరళీకరణ చేసి, గడువు పెంచాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం యూటీఎఫ్ ఎంతో పోరాటం చేసిందని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించలేదని అన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

శ్రీసత్యసాయి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా భూతన్న, అధ్యక్షుడిగా శెట్టిపి జయచంద్రారెడ్డి, సహాధ్యక్షులుగా జీహెచ్ బాబు, పీఎస్ సీతామహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా శ్రీనివాసులుతోపాటు మరో ఎనిమిది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ రాష్ట్ర కారదర్శి కోటేశ్వరప్ప వ్యవహరించారు.

కార్మికుల జీవనోపాధికి ధరాఘాతం

■ ఏఐయూటీయూసీ అఖిల భారత కార్యదర్శివర్గ సభ్యుడు సోమశేఖర్ యాదగిరి


ప్రసంగిస్తున్న సోమశేఖర్ యాదగిరి

అనంతపురం కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులు, మందులు, పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదలతో కార్మికుల జీవనోపాధికి తీవ్ర విఘాతం కలుగుతోందని ఏఐయూటీయూసీ అఖిల భారత కార్యదర్శివర్గ సభ్యుడు సోమశేఖర్ యాదగిరి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం నిర్వహించిన ఏఐయూటీయూసీ రాష్ట్ర మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నేడు మనదేశంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద క్రూర దోపిడీవల్ల కోట్లాదిమంది కార్మికులు ఉపాధి, ఉద్యోగాలు కోల్పోతున్నారన్నారు. నేటి మార్కెట్ సంక్షోభంలో కూడా అత్యధిక లాభాలు గడించడానికి, ప్రపంచ మార్కెట్‌లో తమ ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి పాలస్తీనా, లెబనాన్, ఉక్రెయిన్ దేశాలపై సామ్రాజ్యవాద శక్తులు అన్యాయంగా యుద్ధాలు చేస్తూ లక్షలాదిమంది ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయన్నారు. ఏపీలో కూడా పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం ప్రవేశపెట్టిన గ్లోబలీకరణ, ప్రైవేటీకరణ విధానాలతో లక్షలాదిమంది కార్మికులు, రైతులు జీవనోపాధి కోల్పోతున్నారన్నారు. ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, ఆర్థిక సమస్యలతో దిక్కుతోచక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను కొనసాగిస్తోంద న్నారు. కార్యక్రమంలో ఎస్‌యూసీఐ(సి) రాష్ట్ర కమిటీ సభ్యుడు రాఘవేంద్ర, ఏఐయూటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జి సుధీర్, అశోక్, ప్రమీల, నాగన్న, రామకృష్ణారెడ్డి, మంజునాథ్, కిశోర్, శేఖర్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి కబుర్లే పట్టించాయి..!

కాల్ డేటా ఆధారంగా దొరికిన ముగ్గురు
రామాంజినమ్మ మృతదేహం లభ్యం..?

అనంతపురం క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న అటెండర్ రామాంజినమ్మ హత్య కేసు ఓ కొలిక్కి వచ్చింది. ఆమెను హత్య చేసిన వారెవరు..? ఎందుకు చంపారో పోలీసులకు స్పష్టత వచ్చింది. కానీ, శనివారం లభించిన మృతదేహం రామాంజినమ్మదా..?కాదా..? అనేది తేల్చాల్సిన బాధ్యత పోలీసులపై పడింది. రామాంజినమ్మ గతనెల 18న అదృశ్యమైంది. నెలాఖరులో కుటుంబ సభ్యులు అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెలలో కేసు కొంత ముందుకు కదిలింది. కొన్ని సంఘటనల ఆధారంగా పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు తమకేమీ తెలియదని చెప్పుకొచ్చినట్లు సమాచారం. పోలీసులకు ఎట్టకేలకు శనివారం రామాంజినమ్మ ఇంటి సమీపంలో ఓ మహిళ మృతదేహం కనిపించింది. ఆమె ధరించిన చీర, బెడ్‌షీట్, ఇతర ఆనవాళ్లు మృతదేహం ఆమెదేనని స్పష్టం చేస్తున్నాయి. కానీ శరీరం బాగా కుళ్లిపోయి ఉండడంతో ఆ శరీరం ఆమెదేనా..?కాదా..? అనేది తేలాల్సి ఉంది. ఆదివారం వీఆర్‌ఓ సమక్షంలో పంచనామా చేయించి, అనంతరం పోస్టుమార్టం చేయించారు. ఆ మృతదేహం ఎవరిదనే విషయం తేల్చడానికి డీఎన్‌ఏ టెస్ట్ చేయించనున్నారు. విజయవాడలో ఆ టెస్ట్ చేయిస్తారు. మరో 10 రోజుల్లో ఆ మృతదేహం ఎవరిదనేది స్పష్టత రానుంది.



అర్ధరాత్రి ఊసులే...

రామాంజినమ్మ అదృశ్యంతో రూరల్ సీఐ శేఖర్ ఆమె ఇంటి నుంచే దర్యాప్తు చేపట్టారు. తొలుత ఎలాంటి క్లూ లభించలేదు. విచారణలో ఎదురుగా నిర్మిస్తున్న కొత్త ఇంటి పనిలో ఉన్న బేల్దారి నుంచి విచారణ ప్రారంభించారు. తొలుత తానేమీ ఫోన్‌లో మాట్లాడలేదని, సీసీ ఫుటేజీలు లేకుండానే తమను ఎలా అరెస్ట్ చేస్తారని చాలా గట్టిగానే ప్రశ్నించినట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు నెలల కాల్‌డేటా తీసి చూస్తే స్పష్టత రాలేదు. ఆ తరువాత ఒక సంవత్సరం కాల్ లిస్టులు, రికార్డులు బయటకు తీసినట్లు సమాచారం. దీంతో రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఆ యువకుడు, రామాంజినమ్మ మాట్లాడిన ఊసు కబుర్లన్నీ బయటపడ్డాయి. అదుపులోకి తీసుకున్న వ్యక్తులు చాలా ధీమాతో ఉన్నట్లు తెలుస్తోంది. శవం దొరికితే కదా అన్నట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి రామాంజినమ్మ హత్యకేసు ఎలాంటి మలుపులు తిరుగుతుందో..?

బాలికల టెన్నికాయిట్ విజేత 'అనంతపురం'

ముగిసిన 68వ అంతర్ జిల్లా స్కూల్ గేమ్స్ పోటీలు

చింతలపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చింతలపూడిలో ఈనెల 9, 10 తేదీల్లో ప్రభుత్వ హైస్కూలులో జరిగిన రాష్ట్ర 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. 13 జిల్లాల నుంచి బాలురు, బాలికలు 390 మంది పాల్గొ న్నారు. 78 జట్లు లీగ్ నాకౌట్ పద్ధతిలో పోటీపడ్డాయి. దీనిలో అండర్-19 బాలికల విభాగంలో అనంతపురం ప్రథమ, తూర్పుగోదావరి ద్వితీయ, చిత్తూరు తృతీయ స్థానాలు పొందాయి. అండ ర్-17 బాలికల విభాగంలో అనంతపురం ప్రథ మ, తూర్పుగోదావరి ద్వితీయ, పశ్చిమ తృతీయ స్థానాలు పొందాయి. అండర్-14 బాలికల విభా గంలో పశ్చిమ ప్రథమం, విజయనగరం ద్వితీయ, అనంతపురం తృతీయ స్థానాలు పొందాయి.

బాలుర విభాగంలో.. అండర్-19లో పశ్చిమ ప్రథమ, విజయనగరం ద్వితీయ, శ్రీకాకుళం తృతీయ, అండర్-17 బాలుర విభాగంలో ప్రథమ తూర్పుగోదావరి, ద్వితీయ విశాఖ పట్టణం, తృతీయ అనంతపురం సాధించాయి. అండర్-14 బాలుర విభాగంలో అనంతపురం ప్రథమ, పశ్చిమ ద్వితీయ, తూర్పుగోదావరి తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు మాజీ స్పోర్ట్స్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పేరం రవీంద్రనాథ్, పోటీల పరిశీలకులు ఎన్.టి.ప్రసాద్, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ, కె.రమేష్, కె.సురేష్‌కుమార్, హెచ్‌ఎం పి.సుధాక రరావు, పిట్టా వేణు, మాటూరి చక్రధరరావు, అల్లూరి గిరిరాజు తదితరుల చేతుల మీదుగా మెమెంటోలు, బహుమతులు అందజేశారు.

గెలుపే లక్ష్యంగా పరుగెత్తాలి

- యువతకు పిలుపునిచ్చిన కడప జేసీ అదితిసింగ్
- అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభం

కడప స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరైన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఆత్మవిశ్వాసంతో పరుగెత్తాలని జేసీ అదితిసింగ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ) స్టేడియంలో వేకువజామున 3 గంటలకు ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఎంపికలు సంబంధిత రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నన్ పునీత్ అధ్యక్షతన ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ అదితిసింగ్ హాజరై మొదటి దశ పరుగును జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఇర్విన్, కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాకేశ్‌చంద్, అనుబంధ సంఘాల అధికారులు పాల్గొన్నారు. కాగా.. కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 4000 మంది అభ్యర్థులు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరు కానున్నారు.

అమిగోస్ ఎండీపై చర్యలు తీసుకోండి

వైసీపీ సమావేశాలకు మైనింగ్ సొమ్ము
మైన్స్ లీజు కాంట్రాక్టర్ రాజేష్


అమిగోస్ సంస్థ ప్రసాద్‌రెడ్డి వైసీపీ సమావేశాల్లో పాల్గొన్న ఫొటోలను చూపుతున్న రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనేక అక్రమాలకు పాల్పడిన అమిగోస్ మినరల్స్ సంస్థ ఎండీ ప్రసాద్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మైన్స్ లీజు కాంట్రాక్టర్ రాజేష్ ప్రభుత్వాన్ని కోరారు. తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అమిగోస్ మినరల్స్ సంస్థ ఎండీ ప్రసాద్‌రెడ్డి మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి చేసిన అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఫొటోలను విడుదల చేశారు. రాజేష్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వైసీపీ అండతో ఖనిజ సంపదను అమిగోస్ కొల్లగొట్టిందని ఆరోపించారు. అమిగోస్ ప్రసాద్‌రెడ్డి ఆగడాలకు సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడం, చెక్‌పోస్టులు పెట్టి, బెదిరించి మైనింగ్ లీజ్ కాంట్రాక్టర్ల నుంచి కోట్లాది రూపాయల వసూళ్లకు పాల్పడ్డారని విమర్శించారు. మైనింగ్‌లో సంపాదించిన సొమ్మును కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లో సమావేశాల నిర్వహణ, వైసీపీకి ఎన్నికల్లో వినియోగించారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో మైన్స్ లీజ్ కాంట్రాక్టర్లను బెదిరించి, కేసులు పెట్టి వేధించారని తెలిపారు. ఎంతో మంది మైన్స్ లీజు కాంట్రాక్టర్లను నష్టపరిచి సొమ్ము దోచుకున్నారని ఆరోపించారు. అమిగోస్ ప్రసాద్‌రెడ్డి దోచుకున్న ఖనిజసంపదను కక్కించాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్‌ను కలిసి వివరిస్తానని తెలిపారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

ప్రధాన రహదారి పక్కన మట్టికుప్పలు
చోద్యంచూస్తున్న అధికారులు

చెరువులోని మట్టిని తవ్వుతున్న దృశ్యం


గాండ్లపెంట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారి పక్కనే వున్న చెరువులో వైసీపీ నాయకుడు మట్టిని తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాండ్లపెంట మండలంలోని కదిరి - రాయచోటి ప్రధాన రహదారి పక్కనే ఉన్న కోటపల్లి చెరువులో గత మూడు రోజుల నుంచి జేసీబీతో మట్టిని తవ్వేస్తూ ట్రాక్టర్లతో సొంత భూమిలోకి తరలిస్తున్నారు. ప్రధాన రహదారిలోని నీరు పొలంలోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేసుకుంటున్నాడు. రోడ్డు పక్కన చెరువులోని బంకమట్టి తోలడంతో వర్షా కాలంలో వాహనాలు పక్కకు వెళితే కురుకుపోయే ప్రమాదం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే చెరువు కట్ట సమీపంలో మట్టి తవ్వడంతో కట్ట కూడా దెబ్బతినే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టిని ఇష్టానుసారంగా తరలిస్తున్నాడు. ప్రధాన రహదారిలోనే యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


ప్రధాన రహదారి పక్కన వదిలిన మట్టి కుప్పలు

ప్రాణాలతో చెలగాటం

అనంతపురం-తాడిపత్రి రహదారిపై నిత్యం ప్రమాదాలు
ఈ రోడ్డులో ప్రయాణమంటే హడల్
కనిపించని హెచ్చరిక బోర్డులు
ప్రాణాలు పోతున్నా చలించని అధికారులు

శింగనమల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం-తాడిపత్రి జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. శింగనమల నియోజకవర్గ పరిధిలో ఫోర్‌లేన్ రహదారి రోడ్డు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సూచికలు పెట్టకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రయాణికులు మృతి చెందారు. ఈ రహదారిలో ప్రతి రోజూ ఏదో ఒక చిన్న ప్రమాదం జరుగుతుండడంతో వాహనదారులు గాయాలపాలవుతున్నారు. అక్టోబరు 26న నాయనిపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏకంగా ఆరుగురు ఇస్కాన్ భక్తులు మృతి చెందారు. రోడ్డు పనులు జరిగే ప్రాంతాల్లో ప్రమాద సూచికలు, హెచ్చరికలు పెట్టకపోవడంతో ఎక్కడ ఏమి జరుగుతుందోనని వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ప్రయాణిస్తున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేకపోవడం విస్మయం కలిగిస్తోంది.


గత నెల 26న ప్రమాదం జరిగిన ప్రదేశం

ప్రమాదం తర్వాత హెచ్చరిక బోర్డు

నాయనిపల్లి క్రాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన మరుసటి రోజు అక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ పని ముందే ఎందుకు చేయలేదన్న విమర్శలు స్థానిక ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. నాయనపల్లి క్రాస్ మధ్యలో బ్రిడ్జి ఏర్పాటు చేస్తున్నారు. బ్రిడ్జి ఏర్పాటుకు సంబంధించి పెద్ద బీమ్‌ను ఏర్పాటు చేశారు. ఇంకా బ్రిడ్జి పనులు జరగడం లేదు. అనంతపురం - తాడిపత్రి మధ్య తిరిగే వాహనాలు నాయనిపల్లి క్రాస్ వద్దకు రాగానే ఎదురెదురుగా క్రాస్ చేయాల్సి వస్తోంది. అక్కడ బ్రిడ్జి నిర్మాణానికి పెద్ద బీమ్ ఏర్పాటు చేయడంతో అనంతపురం నుంచి తాడిపత్రి వైపునకు వెళ్లే వాహనాలు బ్రిడ్జి ఎడమవైపు నేరుగా వెళ్లేందుకు మార్గం లేదు. బీమ్‌కు కుడివైపుగానే వెళ్లాల్సి వస్తోంది. బ్రిడ్జికి రెండు వైపులా సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేసి ఉంటే ఈ ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉండేది కాదని స్థానికులు అంటున్నారు.

బ్రిడ్జి నిర్మాణాల వద్ద సూచికలేవీ..?

ఫోర్‌లేన్ రోడ్డు పనుల్లో భాగంగా శింగనమల నియోజకవర్గ పరిధిలోని బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం నుంచి శింగనమల మండలం నాయనపల్లి క్రాస్, నార్పల మండలం మద్దలపల్లి వరకు 16 కిలోమీటర్ల మేర పనుల్లో భాగంగా ప్రతి గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో కనీసం సూచికలు, హెచ్చరికల బోర్డు లేకపోవడం గమనార్హం. సర్వీస్ రోడ్డులో ప్రయాణించే వాహనదారులకు పనులు జరిగే ప్రాంతాల్లో వాహనాల రాకపోకలతో వచ్చే దుమ్మూధూళితో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించని పరిస్థితి ఏర్పడింది. డైవర్షన్ రోడ్డు వద్ద కనీసం ప్రమాదం సూచికలు ఏర్పాటు చేయలేదు. వాహనదారులకు స్పష్టంగా కనిపించే విధంగా డైవర్షన్ల వద్ద సూచికల బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పనులు ప్రారంభమైనప్పటి నుంచి శింగనమల మండల పరిధిలోనే 11 మంది మృతి చెందగా 200 మందికి పైగా వాహనదారులు గాయపడ్డారు.

బ్రిడ్జిల వద్ద తారురోడ్డు వేయాలి



దారి పొడవునా బ్రిడ్జిల నిర్మాణాలు జరుగుతున్నాయి. అనంతపురానికి వాహనంలో వెళ్లాలంటేనే భయంగా ఉంది. బ్రిడ్జిలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో సర్వీస్ రోడ్డును మట్టితో వేయడంతో దుమ్ము, ధూళి ఎక్కువై ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. డైవర్షన్ దారుల్లో ఎలాంటి హెచ్చరిక, సూచకల బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు చిన్న, చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చు.

- లక్ష్మీనారాయణ, పెరవలి

అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు



అధికారుల నిర్లక్ష్యంతోనే నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇస్కాన్ భక్తుల మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణం. నాయనపల్లి క్రాస్‌లో ఎలాంటి హెచ్చరిక, సూచికల బోర్డులు ఏర్పాటు చేయలేదు. క్రాస్ మధ్యలో బ్రిడ్జి బీమ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఒకే వైపు ఎదురెదురుగా వాహనాలు క్రాస్ చేయాల్సి వస్తోంది. అక్కడ కనీసం సూచికల బోర్డు ఏర్పాటు చేయలేదు. ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా రోడ్డు పనులు జరిగే చోట, డైవర్షన్ల వద్ద పగలు, రాత్రి వేళల్లో వాహనదారులకు కనిపించేలా సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలి.

- షామీర్, నాయనపల్లి క్రాస్

వ్యవసాయ పరికరాల కోసం ఎదురుచూపు



వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేత
తీవ్ర ఇబ్బందులు పడిన రైతులు
కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

ధర్మవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తమది రైతు ప్రభుత్వమని, వ్యవసాయానికి పెద్దపీట వేశామని చెప్పుకొచ్చిన వైసీపీ సర్కారు ప్రకటనలకే పరిమితమైంది. గత ఐదేళ్లూ అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ప్రధానంగా వ్యవసాయ పరికరాలు, సూక్ష్మ పోషకాలకు మంగళం పాడేసింది. చివరకు టార్పాలిన్లను కూడా అందించలేకపోయింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వీటిని రాయితీపై పంపిణీ చేసేవారు. గత వైసీపీ ప్రభుత్వం విస్మరించడంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

ఐదేళ్లూ అంతే..

సాగుకు యంత్రపరికరాలు ఎంతో అవసరం. స్ర్పేయర్లు, కల్టివేటర్లు, ట్రాక్టర్లు రైతులకు సాగులో సహాయకారిగా ఉంటాయి. మంచి దిగుబడులు వచ్చేందుకు సూక్ష్మపోషకాలు అవసరం. కల్లాల్లో పంట ఉత్పత్తుల రక్షణకు టార్పాలిన్లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. గత ఐదేళ్లూ రాయితీపై వీటిని పంపిణీ చేయలేదు. దీంతో రైతులు తీవ్రకష్టాలు పడ్డారు. ప్రధానంగా స్ర్పేయర్ల కొరతను ఎదుర్కొన్నారు. రాయితీ స్ర్పేయర్ల కోసం వైసీపీ హయాంలో వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. మందు పిచికారి చేయడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తైవాన్ స్ర్పేయర్లను పంపిణీ చేసింది. స్ర్పేయర్లతోపాటు కల్టివేటర్లు, పవర్ వీడర్, ట్రాక్టర్ల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

సూక్ష్మ పోషకాల కోసం పాట్లు

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం వాటిని రైతులకు అందించేది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు పంపిణీ చేపట్టలేదు. సూక్ష్మపోషకాల (జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం) కోసం రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. డిమాండ్ దృష్ట్యా వాటి ధరలు అమాంతం పెరిగిపోవడంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాలో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. యంత్ర పరికరాలు, సూక్ష్మపోషకాల కోసం ఎదురుచూస్తున్నారు.

వ్యవసాయ పరికరాలు ఇవ్వాలి



వైసీపీ ప్రభుత్వంలో రైతులకు వ్యవసాయ పరికరాలు అందక బయట మార్కెట్‌లో కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. గుంటక, మడకలు, స్ర్పేయర్లు, రోటోవేటర్లు, టార్పాలిన్‌లు కూడా అందించలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కొందరు రైతులు అప్పులు చేసి బయట మార్కెట్‌లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా వ్యవసాయ పరికరాలు అందించాలి.

- చంద్రశేఖర్, బండ్లపల్లి, కొత్తచెరువు మండలం

సూక్ష్మ పోషకాలు పంపిణీ చేయాలి..



పండ్లతోటలకు సబ్సిడీతో అందించే సూక్ష్మపోషకాలను కూడా గత వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేదు. స్ర్పేయర్లు, టార్పాలిన్ పంపిణీ నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం సూక్ష్మపోషకాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలి. రైతులకు మేలు చేసే విధంగా బిందు సేద్యపరికరాల పంపిణీ కూడా సులభతరం చేయాలి.

- తమ్మినేని రామ్మోహన్, రామాపురం, తాడిమర్రి మండలం

బిల్లులు రాలే

ఉమ్మడి జిల్లా హాస్టళ్లకు రూ. 12 కోట్లకుపైగా పెండింగ్
నాలుగు నెలలుగా అందని వైనం
ఇబ్బందులు పడుతున్న వార్డెన్లు, విద్యార్థులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బిల్లులు సకాలంలో రాకపోవడంతో సంక్షేమశాఖ వసతి గృహాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో నవంబరు నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జూన్ వరకూ మంజూరు చేసింది. అయితే జూలై నుంచి ఇప్పటి వరకూ మళ్లీ బిల్లులు పెండింగ్ పడ్డాయి. ఇంత వరకూ బిల్లులకు సంబంధించి బడ్జెట్ రాకపోవడంతో వార్డెన్లు ఇబ్బంది పడుతున్నారు. కొందరు వార్డెన్లు అప్పులు తెచ్చి డైట్‌ను అమలు చేస్తుండగా, మరికొన్ని చోట్ల మెనూను కుదించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాకు నాలుగు నెలలకు కలిపి దాదాపు రూ. 12 కోట్లకుపైగా డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆయా శాఖల అధికారుల ద్వారా తెలిసింది.

నాలుగు నెలల బిల్లులు పెండింగ్...

జిల్లాలో ఉన్న 58 బీసీ హాస్టళ్లలో 8027 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 59 బీసీ హాస్టళ్లు ఉండగా... 6281 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అనంతపురం జిల్లాలో 58 ఎస్సీ హాస్టళ్లు ఉండగా... 5791 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. శ్రీసత్య సాయి జిల్లాలో 27 ఎస్సీ హాస్టళ్లు ఉండగా... 1897 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అనంతపురం జిల్లాలో 10 గిరిజన సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఉండగా అందులో 590 విద్యార్థులు వసతి పొందుతున్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 9 గిరిజన సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఉండగా... అందులో 427 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ,ఎస్సీ,ఎస్టీ వసతిగృహాలకు జూలై నెల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.


భోజనం కోసం లైన్లో ఉన్న విద్యార్థులు (ఫైల్)

పెండింగ్ వాస్తవమే

వసతిగృహాలకు సంబంధించిన డైట్ బిల్లులు జూలై నుంచి పెండింగ్‌లో ఉన్నది వాస్తవమే. ఇందుకు సంబంధించిన బడ్జెట్ రాష్ట్రస్థాయి నుంచి రావాల్సి ఉంది. సమస్య గురించి పైస్థాయి అధికారులకు వివరించాం. తొందరలోనే బడ్జెట్ వచ్చే అవకాశం ఉంది. వచ్చిన వెంటనే డివిజన్ల వారిగా బడ్జెట్‌ను కేటాయిస్తాం.

కుష్బూకొఠారీ, డీడీ, బీసీ,ఎస్సీ సంక్షేమశాఖలు

ప్రాచీన ఆలయాల విశిష్టతను చాటాలి

పుట్టపర్తి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన ఆలయాల విశిష్టతను తెలియజేయడం కోసం మరింత సాహిత్యం వెలుగులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు గుండ్లూరు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సాయిఆరామంలో చరిత్రకారుడు మైనాస్వామి రాసిన 'ప్రాచీన ఆలయాల వైభోగం' పుస్తకావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన ఆలయాల వైభవాన్ని ప్రపంచానికి తెలియజేయాలని చేస్తున్న కృషిని కొనియాడారు. రాష్ట్రంలో కొన్ని వేల ఆలయాలు ఉన్నాయని, వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం అతితక్కువగా లభ్యమవుతోందన్నారు. ప్రతి ఆలయంపై ఒక పుస్తకాన్ని తీసుకురావాలని దేవదాయశాఖకు ఆయన విజ్ఞప్తి చేశారు. పుస్తక రచయుత మైనాస్వామి మాట్లాడుతూ బృహత్తర పర్యాటక వలయంలో భాగంగా తాను ప్రాచీన ఆలయాల వైభోగాన్ని ప్రపంచానికి తెలియజేయాలని పుస్తక రచన చేశానని తెలిపారు. జిల్లాలోని హేమావతి నుంచి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి వరకు గల ప్రాచీన ఆలయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఒక నివేదికను సమర్పించినట్లు పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధి జరిగితే ఆయా ప్రాంతాల రూపురేఖలు మారిపోతాయని, ఉపాధి పెరుగుతుందని, తద్వార ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుందని వివరించారు. కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, వీహెచ్‌పీ నాయకుడు డాక్టర్ వేదవ్యాస్, టీడీపీ నాయకుడు సామకోటి ఆదినారాయణ, పుడా మాజీ చైర్మన్ కోటా సత్యం, పురపాలకసంఘం ఫ్లోర్‌లీడర్ రత్నప్పచౌదరి, బీజేపీ నాయకుడు కొండమరాజు చరిత్రకారుడు మైనాస్వామి కృషిని ప్రశంసించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

న్యూస్‌బాక్స్

హాకీ చాంపియన్ ఆర్ట్స్ కళాశాల జట్టు


ఆర్ట్స్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల గ్రూప్-సి హాకీ విజేతగా ఆర్ట్స్ కళాశాల జట్టు నిలిచింది. శ్రీకృష్ణదేవరాయ అంతర్ కళాశాలల గ్రూప్-సి పోటీలలో భాగంగా ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో హాకీ పోటీలు నిర్వహించారు. ఫైనల్ పోటీల్లో ధర్మవరం జట్టుపై ఆర్ట్స్ కళాశాల జట్టు 3 గోల్స్ తేడాతో విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన ఆర్ట్స్ కళాశాల జట్టు, రన్నర్ ధర్మవరం జట్లకు ఎస్కే యూనివర్శిటీ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ కప్ అందజేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శశాంకమౌళి, పీడీ శ్రీరామ్, చంద్రమోహన్ రెడ్డి విజేత జట్టును అభినందించారు.

1.623 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటి నిల్వ 1.623 టీఎంసీలు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. అలాగే ఇన్‌ఫ్లో 924 క్యూసెక్కులుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 1011 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

విషాదంలోనూ దాతృత్వం

ఆత్మహత్య చేసుకున్న రైతు కళ్లు దానం


కళ్లను అందిస్తున్న కుటుంబ సభ్యులు

కనగానపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విషాదం సమయంలో కూడా రైతు కుటుంబం తమ దాతృత్వాన్ని చూపింది. అప్పులబాధ తాళలేక చెన్నేకొట నరసింహులు శనివారం రాత్రి అనంతపురంలో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మృతుడి భార్య భారతి, కుమారుడు సతీష్ బాధలో కూడా నరసింహులు కళ్లను దానం చేసేందుకు ముందుకొచ్చారు. ఆదివారం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రైతు నరసింహులు రెండు కళ్లను సేకరించి భద్రపరిచారు. రైతు కుటుంబాన్ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ నాయకులు యాతం పోతలయ్య, నెట్టెం వెంకటేష్, సుధాకర్‌చౌదరి, బంగి మల్లేష్, బొజ్జన్న, రమేష్ పరామర్శించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

మడకశిరటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం తుమకూరు ప్రాంతానికి చెందిన మోహన్‌కుమార్ అనే వ్యక్తి హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం సీఐ కార్యాలయంలో హత్యకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. 2023 ఆగస్టు 23న నాగరత్నమ్మ తన పెద్ద కుమారుడు మోహన్‌కుమార్ (52) కనిపించలేదని తుమకూరులోని జయనగర్ పోలీ్‌సస్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు వివరించారు. మృతుడి భార్య కవిత అక్తర్‌పాషా అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పరచుకొందని, విషయం భర్తకు తెలియడంతో గొడవ జరిగిందన్నారు. కవిత అక్తర్‌పాషా సహకారంతో తుమకూరు పట్టణంలో ఒక హోటల్‌ను ఏర్పాటు చేసుకొందని, అక్కడికి వెళ్లి భర్త మోహన్‌కుమార్ గొడవపడ్డారని వివరించారు. దీంతో ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని కవిత ఆమె కొడుకు కౌశిక్, అక్తర్‌పాషా, హోటల్లో పనిచేసే మోహన్‌ప్రసాద్ పథకం రచించారని అన్నారు. మోహన్‌కుమార్‌ను హోటల్‌కు పిలిపించి బిర్యానీలో నిద్రమాత్రలు కలిపి తినిపించారని తెలిపారు. రాత్రి దాదాపు 10.30 గంటల సమయంలో కత్తిలో గొంతు కోసి హత్యచేశారని తెలిపారు. మృతదేహాన్ని మడకశిర మండలం కదిరేపల్లి సమీపంలో రోడ్డు పక్కనే హంద్రీనీవా కాలువలోకి పడేసి వెళ్లినట్లు తెలిపారు. అప్పటి సీఐ సురేష్‌బాబు దర్యాప్తు కొనసాగించారని, తిరిగి సీఐగా వచ్చిన రాజ్‌కుమార్, గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్ నిందితులను శనివారం అదుపులోకి తీసుకొన్నట్లు డీఎస్పీ వివరించారు.

అక్రమ మద్యంపై ఎక్సైజ్ మెరుపు దాడులు

72 మంది బెల్టుషాపు నిర్వాహకులపై కేసులు
1300 లీటర్ల అక్రమ మద్యం పట్టివేత
నాటుసారా స్థావరాలపై దాడులు
33 కేసుల నమోదు
4600 మంది బైండోవర్


గుంతకల్లు మండలంలో నాటు సారా బెల్లపు ఊటను పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

అనంతపురం అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా విభాగాల ఏఈఎస్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది బృందాలుగా విడిపోయి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాడులు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చే అక్రమ మద్యాన్ని పట్టుకుంటున్నారు. నాటుసారా స్థావరాలపై ఆకస్మిక దాడులు చేసి నాటు సారా ఊటలను ధ్వంసం చేస్తున్నారు. మరోవైపు పలు మండలాల్లో బెల్ట్ షాపులపైనా దృష్టి సారించారు. ఆయా ప్రాంతాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటి దాకా 4600 మంది పాత ముద్దాయిలను బైండోవర్ చేశారు. ఆ వ్యక్తులు మరోసారి మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే స్థానిక తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసి అపరాధ రుసుం వసూలు చేయనున్నారు. అపరాధ రుసుం చెల్లించకపోతే రిమాండ్‌కు తరలిస్తామని ఎక్సైజ్ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

1300 లీటర్ల అక్రమ మద్యం పట్టివేత

ఉమ్మడి అనంత జిల్లాలోని కంబదూరు, కళ్యాణదుర్గం, డి.హీరేహాళ్, హిందూపురం సరిహద్దు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా చేసే అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. ఈ ఏడాది అక్టోబరు నెల నుంచి ఇప్పటి దాకా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న 169 మందిని అరెస్టు చేసి, 1300 లీటర్లకుపైగా మద్యాన్ని పట్టుకున్నారు. అక్రమ మద్యం రవాణాకు ఉపయోగించిన 29 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

72 మంది బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసులు

ఉమ్మడి జిల్లాలోని ధర్మవరం మండలం వసంతాపురం క్రాస్, నార్పల మండలం కేశేపల్లి, దుగ్గుమర్రి, బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లి, రాప్తాడు మండలం పాలచెర్ల, శెట్టూరు మండలం చెర్లోపల్లి, అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి, విడపనకల్లు మండలం కరకముక్కల, రాయదుర్గం మండలం డికొండాపురం ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు చేశారు. ఇందులో భాగంగా 72 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో 210 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. మద్యం రవాణాకు ఉపయోగించిన మూడు వాహనాలను సీజ్ చేశారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

నాటు సారా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నారు. ఏ,బీ,సీ కేటగిరీలుగా బృందాలను ఏర్పాటు చేసుకొని ముందస్తు ప్రణాళికల మేరకు నాటు సారా స్థావరాలపై దాడులు చేస్తున్నారు. వజ్రకరూరు, తాడిపత్రి, నార్పల, ఆత్మకూరు, బెళుగుప్ప ముదిగుబ్బ మండలాల్లోని పలు ప్రాంతాల్లో నాటు సారా స్థావరాలపై దాడులు చేశారు. ఇప్పటి దాకా 33 కేసులు నమోదు చేసి 70 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 6300 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు.

జిల్లా నుంచి బహిష్కరిస్తాం



ప్రజల ప్రాణాలకు ముప్పుతెచ్చే విధంగా తీవ్రమైన ఎక్సైజ్ నేరాలకు పాల్పడే వారిపై (నాటు సారా, కల్తీ కల్లు, అక్రమ మద్యం, గంజాయి) పీడీ యాక్టు ప్రయోగించి జిల్లా బహిష్కరణ చేసేలా చర్యలు తీసుకుంటాం. ఎక్సైజ్ నేరాల నియంత్రణ కోసం ఉమ్మడి అనంత జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం. మద్యం షాపుల్లో నిబంధనలు అతిక్రమించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా ఉపేక్షించేది లేదు. అక్రమ మద్యం, నాటు సారా, బెల్ట్ షాపుల నిర్వహణకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం నిఘా ఉంచాం. ఆ మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

-నాగమద్దయ్య, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ముగిసిన అఖండ భజన


పాటలు పాడుతున్న విద్యార్థినులు

పుట్టపర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జయంతి వేడుకల సందర్భంగా చేపట్టిన ముందస్తు అఖండ భజన ఆదివారం రాత్రి 6గంటలకు ముగిసింది. శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన అఖండ భజన 24 గంటల పాటు నిరంతరంగా కొనసాగి సాయంత్రం 6 గంటలకు మంగళహారతితో ముగిసింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో మంగళహారతితో అఖండ భజన ముగించి భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల కష్టాలు

● ఇటీవల కురిసిన భారీ వర్షానికి పాడైపోయిన వైనం
● సకాలంలో కొత్తవి అందక ఇబ్బందులు



రాప్తాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలను ట్రాన్స్‌ఫార్మర్ల కష్టాలు నిత్యం వెంటాడుతున్నాయి. కొత్త సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకుని డీడీలు చెల్లించిన వారికి సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు అందడం లేదు. అలాగే పొలాల్లోని పాత ట్రాన్స్‌ఫార్మర్లు పలు కారణాల వలన పాడైనా సకాలంలో కొత్తవి అందడం లేదు. దీంతో రైతులు విద్యుత్ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో అందకపోవడంతో పంటలకు సకాలంలో నీరు సరఫరా చేయలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● నియోజకవర్గంలో హెచ్‌వీడీఎస్ పథకం ద్వారా రెండు లేదా మూడు మోటార్లకు కలిపి రైతుల పొలంలోనే మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఇలాంటివి వేల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. నియోజకవర్గం వ్యాప్తంగా ఇటీవల భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి కనగానపల్లి చెరువు కట్ట తెగిపోగా, బండమీదపల్లి చెరువు కట్ట మరువ వద్ద కోతకు గురైంది. ఇతర గ్రామాల్లోని చెరువులు, చెక్‌డ్యాంలు మరువ పారాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు పెద్ద పెద్ద ఉరుముల శబ్దాలకు, మెరుపులకు పలు గ్రామాల్లోని రైతుల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు అధిక సంఖ్యలో పాడైపోయాయి. అలాగే వ్యవసాయ మోటార్లు చెడిపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు వర్షాల కు పాడైన ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి అమర్చాలి. అయితే ట్రాన్స్‌ఫార్మర్లు స్టాక్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం విద్యుత్‌శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా దాదాపు 150 వరకూ ట్రాన్స్ ఫార్మర్లు భారీ వర్షాలకు పాడైపోయాయి. అందులో సగం మంది రైతులకు ఉపయోగంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను అందచేశారు. మిగతా వారికి స్టాక్ లేకపోవడంతో అందజేయలేదు.

మార్చేందుకు వారం రోజులు



ఇటీవల కురిసిన భారీ వర్షానికి మా పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు వారం రోజులు పట్టింది. ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు, రవాణా చేసేందుకు రూ. 5 వేలు ఖర్చయింది. అలాగే రెండు మోటార్లు కాలిపోయాయి. వాటి మరమ్మతులకు మరో రూ. 10 వేలు ఖర్చయింది.

- గోవిందు, రైతు, బండమీదపల్లి

మూడు రోజుల్లో అందజేస్తాం

ఇటీవల భారీ వర్షాలకు రాప్తాడు మండలంలో దాదాపు 35 ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోయాయి. అందులో 18 మంది రైతులకు ఉపయోగంలో ఉండే ట్రాన్స్‌ఫార్మర్లు అందజేశాం. మిగతా వారికి మూడు రోజుల్లో అందజేస్తాం.

- శివప్రసాద్, విద్యుత్ శాఖ ఏఈ, రాప్తాడు

సంక్షిప్తం

పెద్దమ్మ దేవతకు ప్రత్యేక పూజలు



నార్పల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చామలూరులో వెలసిన గాజులబావి పెద్దమ్మ దేవత ఆలయ 13వ వార్షికో త్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, విశేష పూజలు చేశారు. అనంతరం పూలగంప ఊరేగించి, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. చెక్కభజన ఏర్పాటు చేశారు.

ఆలయానికి విరాళం

నార్పల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణలో లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం నిర్మాణానికి ఆదివారం పలువురు విరాళాలు అందజేశారు. ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు బ్రహ్మేంద్రస్వామికి మాజీ ఎంపీటీసీ ఆకుల ఆంజనేయులు, మాజీ ఎంపీపీ అరుణమ్మ రూ.15 వేలు, టీడీపీ యువ నాయకుడు ఆకుల బాబు రూ.20వేలు విరాళం అందజేశారు.

మైకు సెట్ వితరణ

చెన్నేకొత్తపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కనుముక్కల గ్రామంలో వెలసిన గుమ్మనాథేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు మైకు సెట్‌ను వితరణ చేశారు. ధర్మవరం పట్టణానికి చెందిన రాధిక, భాస్కర్‌రెడ్డి దంపతులు ఆదివారం మైకు సెట్‌ను ఆలయ అర్చకులు ప్రసన్నకుమార్‌కు అందజేశారు. పురాతనమైన ఆ ఆలయానికి భాస్కర్‌రెడ్డి తన తల్లిదండ్రులైన కృష్ణమ్మ, వెంకటశివారెడ్డి జ్ఞాపకార్థం మైకు సెట్‌ను అందజేసినట్టు గ్రామస్థులు తెలిపారు.

ఆదాయం రూ.4.55 లక్షలు

అనంతపురం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.4,55,640 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. మార్కెట్‌కు శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,94,600, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,61,040 వచ్చిందని తెలిపారు.

ఓటరు నమోదుకు 62 దరఖాస్తులు

అనంతపురం రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియలో 62 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్, ఏఈఆర్‌ఓ హరికుమార్ తెలిపారు. ఆయన ఆదివారం మండలంలోని రుద్రంపేటలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా 28,29,30,31 పోలింగ్ కేంద్రాలను పరిశీ లించారు. రెండు రోజుల ప్రత్యేక క్యాంపెనింగ్‌లో కొత్తగా ఓటరు నమోదుకు 35దరఖాస్తులు వచ్చాయన్నారు. మరిణించిన వారిని తొలగించేందుకు ఐదు, మార్పులు, చేర్పులకు సంబం ధించి 16, పోలింగ్ కేంద్రాల మార్పునకు సంబంధించి ఆరు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలించొద్దు

శింగనమల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పెన్నానది పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శరత్‌చంద్ర పేర్కొన్నారు. ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, సీఐ కౌలుట్లయ్య ఆదేశాల మేరకు... అనుమతి లేకుండా మండలంలోని పెన్నానది పరీవాహక ప్రాంతంలోని గ్రామాల నుంచి ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు. తరిమెల, కల్లుమడి, నిదనవాడ, ఉల్లికల్లు ఉల్లికంటిపల్లి, ఇరువెందల, నలకం చెరువు, కూతలేరుతో పాటు వంక సమీపంలోని పురవలి, పెద్ద జలాలపురం, చిలేపల్లి, జాల్వాకాలువ గ్రామాలు ఆ పరిధిలోకి వస్తాయన్నారు. ఆ గ్రామాల వంక ప్రాంతం నుంచి ఎవరైనా అక్రమం ఇసుక తరలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం



రమీజాన్(ఫైల్)

అనంతపురం క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆరో రోడ్డుకు చెందిన రమీజాన్ అనే మహిళ అదృశ్యమైంది. ఆరో రోడ్డులో ముస్తాక్, రమీజాన్ దంపతులు నివాసం ఉంటున్నారు. అత్త మందలించడంతో రమీజాన్ శనివారం సాయంత్రం టాబ్లెట్ తెచ్చుకుంటానని చెప్పి ఇంటి నుంచి బయటకెళ్లింది. కానీ రాత్రికి కూడా తిరిగి రాలేదు. దీంతో భర్త ముస్తాక్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదృశ్యం కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడులు

చెన్నేకొత్తపల్లి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం శివారులో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. పక్కా సమాచారంతో ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,200 నగదు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ జెండా కట్ట ఆవిష్కరణ

అనంతపురం రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని చిన్నంపల్లి పంచాయతీ సునీతమ్మ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ జెండా కట్టను ఆ పార్టీ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. సర్పంచు శివశంకర్, తెలుగు రైతు రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు నారాయణస్వామి, మాజీ సర్పంచు కొండయ్య, సింగిల్ విండో డైరెక్టర్ వెంకట్ చౌదరి, వెంకటరాముడు, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సునీతమ్మ కాలనీ వాసులు పవన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరుల పాల్గొన్నారు.

కార్యకర్తలను ఆదుకునే పార్టీ టీడీపీ

రాప్తాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకు నే ఏకైక పార్టీ టీడీపీనే అని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు అన్నారు. ఆయన ఆదివారం మండలపరిధిలోని బండమీదపల్లిలో ఇంటింటికీ తిరిగి ప్రజలతో టీడీపీ సభ్యత్వం చేయించారు. కుటుంబంలో ఎంత మంది వ్యక్తులైనా టీడీపీ సభ్యత్వం చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చెన్నేకొత్తపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో ఆదివారం సంబంధిత అధికా రులు దాడులు నిర్వహించి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల గ్రామానికి చెందిన ఓ మహిళ నుంచి 60, రామగిరి మండలం ముత్యాలమ్మపల్లికి చెందిన వ్యక్తి వద్ద నుంచి 54 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. వారిద్దరిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కర్నాటక మద్యం, నాటుసారా,బెల్టుషాపులు నిర్వహించి నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్, శంకరనాయక్, రంగనాయక్, హరినాథ్ పాల్గొన్నారు.

● అనంతపురం క్రైం: నగరంలో బెల్ట్‌షాపు నిర్వహించేందుకు మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా నాలుగో పట్టణ పోలీసులు నందమూరి నగర్‌కు చెందిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఆదివారం పోలీసులు తనిఖీలో అతడిని పట్టుకున్నారు. అతడి నుంచి 50 క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.

చికెన్ దుకాణంలో చోరీ

అనంతపురం క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగో రోడ్డులో నిర్వహిస్తున్న మునీర్ చికెన్ సెంటర్‌లో ఈ నెల 7వ తేదీ రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు షట్టర్ తెరిచి దొంగతనం చేశారు. అందులో రూ.53,230 నగదు చోరీకి గురైనట్లు యజమాని రఫీక్ త్రీటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు.

కాంగ్రెస్ పార్టీ అర్బన్ ఇన్‌చార్జ్‌గా దాదాగాంధీ



అనంతపురం న్యూటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఆ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీని నియమించారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకం ఉంచి బా ధ్యతలు అప్పగించిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు, తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి దాదాగాంధీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

సౌత్‌జోన్ చెస్ పోటీల్లో యశస్‌కు తృతీయస్థానం



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ చెస్ పోటీల్లో జిల్లాకు చెందిన సాయి యశస్‌కు తృతీయ స్థానం దక్కిం ది. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో ఆదివారం నిర్వ హించిన సౌత్‌జోన్ స్థాయి చెస్ పోటీల్లో సాయి యశస్ అద్భుత ప్రతిభా ప్రదర్శనతో తృతీయ బహుమతి సాధించాడు. విజేతను జిల్లా చెస్ అ సోసియేషన్ కార్యదర్శి రవిరాజు అభినందించారు.

దూదేకుల యువతకు ఉపాధి చూపుదాం

● ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మస్తాన్



సమావేశంలో మాట్లాడుతున్న దూదేకుల సంఘం నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న దూదేకుల యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనలో సంఘం నాయకులు, కార్యకర్తలు పాలుపంచుకోవాలని దూదేకుల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మస్తాన్ పిలుపునిచ్చారు. రుద్రంపేటలోని దూదేకుల సంఘం కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ... భవిష్యత్తులో దూదేకుల యువతను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఉద్యోగ కల్పన చేసే విధంగా ప్రణాళిక తయారుచేసి, కుల పెద్దల సాయంతో ముందుకు తీసుకెళ్లేలా కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. కావున సంఘం నాయకులతో పాటు సాధారణ కార్యకర్తలు తమవంతు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి షేకావలి, నాయకులు ఖాసీం, బ్రహ్మం, కెప్టెన్ షేకన్న, మహబూబ్ సాహెబ్, మోపూరి రఫి, ఖాసీం సార్, హుస్సేనయ్య, నబీరసూల్, టీచర్ రఫి, బాష, రాజకుల్లాయప్ప, వన్నూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీర తోటను పరిశీలించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బీర తోటలో అధికారులు

అనంతపురం రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కక్కలపల్లికి చెందిన శేఖర్‌రెడ్డి, రాజేంద్ర సాగుచేసిన బీర తోటను ఉద్యాన, వ్యవసాయ శాఖాధికారులు ఆదివారం పరిశీలించారు. 'కొండ నాలుకకు మందేస్తే..' అన్న శీర్షికతో కక్కలపల్లిలో దెబ్బతిన్న బీర తోటపై ఆంధ్రజ్యోతిలో ఆదివారం కథనం ప్రచురించిన విషయం విదితమే. ఇందుకు సంబంధిత అధికారులు స్పందించారు. ఈ క్రమంలోనే ఉద్యానశాఖ అధికారి నెట్టి కంటయ్య, ఉద్యాన విస్తరణాధికారి రామాంజినేయులు, వ్యవసాయ విస్తరణాధికారి మురళి, ఉద్యాన సహాయకుడు దేవేంద్ర బీర తోటను సందర్శించారు. ఎండిన ఆకులను పరీక్ష నిమిత్తం సేకరించారు. పంట దెబ్బతినడానికి కారణాలను రైతులు శేఖర్‌రెడ్డి, రాజేంద్ర నుంచి రాతపూర్వకంగా వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... బూడిద తెగులు నివారణ నిమిత్తం రుద్రంపేటలోని ఎరువుల దుకాణంలో సంప్రదించి వారి చూచనల మేరకు ఎక్సెల్లార్, జింగామైన్, క్లిఫ్ కలపి పిచికారి చేశామని రైతులు చెప్పా రన్నారు. తోట మాడిపోయిన నేపథ్యంలో ఆకులను పరీక్ష నిమిత్తం సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు. అక్కడి నివేదికలను ఉన్నతాధికారులకు పంపి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నైపుణ్యాలతో కూడిన విద్య అందించాలి

● కళాశాలలకు ఎస్కేయూ రెక్టార్ సూచన



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న రెక్టార్, రిజిస్ట్రార్ తదితరులు

అనంతపురం సెంట్రల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన విద్యనందించేందుకు రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ చర్యలు తీసుకుంటోందని, ప్రతి కళాశాలలో అటువంటి విద్యనందించాలని ఎస్కేయూ రెక్టార్ వెంకటనాయుడు సూచించారు. నగరం లోని ఎస్వీ ప్రైవేట్ డిగ్రీ కళాశాల రజతోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు హాజరయ్యారు. కళాశాల చైర్మన్ సోమశేఖర్‌రెడ్డితో కలిసి వేడుకలను ప్రారంభించిన రెక్టార్, రిజిస్ట్రార్ మాట్లాడుతూ... మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్‌కలాం దేశఖ్యాతిని ప్రపంచానికి చాటారన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి వారి కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. అనంతరం సావనీర్‌ను విడుదలచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి, మాజీ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, సరిత, సొసైటీ ట్రెజరర్ రామసుబ్బమ్మ, కార్యదర్శి సౌజన్య, మెంబర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి తైక్వాండో జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి తైక్వాండో జట్టును ఎంపిక చేశారు. స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో ఆదివారం జిల్లా స్థాయి తైక్వాండో సబ్‌జూనియర్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను తైక్వాండో జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురుస్వామి తెలిపారు. బాలుర విభాగంలో... శృతిక్, శ్రీకర్, జస్విన్‌సాయి, జస్వంత్, రిత్విక్, విరంచి, షాబీర్, దర్శిత్, ఈశ్వర్, హర్షవర్ధన్‌రెడ్డి, ప్రణీత్ రెడ్డి, భవేష్ ఎంపికయ్యారు. బాలికల్లో... ప్రవర్తి, పూజ, సింధు, చైతన్య, ప్రణవి, హేమశ్రీ, ధనవర్షిణి, సాయితన్వి, సాయిసంకల్ప, వైష్ణవి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15వ తేదీ నుంచి ప్రకాశం జిల్లా కందుకూరులో నిర్వహించే 38వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కుళ్ళాయిస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి శాంతరాజ్, కోచ్‌లు కేశవ, వెంకట్, మణీంద్ర, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఆత్మకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం రెండో ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు స్వామివారి దర్శనం కోసం తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయం ప్రధాన అర్చకులు రామస్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు చేసి అలంకరించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అన్నదాన కమిటీ సభ్యులు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బాబు తదితరులు పాల్గొన్నారు.



పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కోటంక స్వామికి వెండిహారం



గార్లదిన్నె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు రూ. 11వేలు విలువ చేసే వెండి హారాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతపురం పట్టణానికి చెందిన పాటిల్ మల్లికార్జున రెడ్డి, రజిత దంపతులు ఆదివారం స్వామిని దర్శించుకున్నారు. అనంతరం 10 తులాల 5 గ్రాముల వెండిహారాన్ని ఆలయ అర్చకులు వైద్యం దామోదరాచార్యులకు అందజేశారు.

వరుస చోరీలతో బెంబేలు

● తాళం వేసిన ఇళ్లే టార్గెట్ ● నూతన ఎస్ఐకి సవాలు



చంద్రాచర్ల కొట్టాలలో బీరువాను ధ్వంసం చేసిన దృశ్యం (ఫైల్)

కనగానపల్లి, నవంబరు 10: మండలంలో కాసుకో... పోలీస్... అంటూ దొంగలు సవాల్ విసురుతున్నారు. తరచూ ఏదో ఒక గ్రామంలో పోలీసులకు పట్టుబడకుండా చోరీలు చేస్తున్నారు. ఇంటి తాళం వేశారా... ఆ ఇల్లు గుల్ల కావల్సిందే. దాదాపు ఐదు నెలల నుంచి జరిగిన చోరీలకు సంబం ధించి బంగారం, నగదు కలిపి రూ. కోటీ దాకా లూటీ అయినట్లు తెలుస్తోంది. వ్యవసాయ పొలాల్లోని పరికాలనూ దొంగలిస్తున్నారు. వరుస చోరీలు ఇటీవల నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్సై మహ్మద్ రిజ్వాన్‌కు సవాలుగా మారాయని చెప్పవచ్చు.

● మండలంలోని మామిళ్లపల్లి, ముక్తాపురం గ్రామాల్లో ఒకే రోజు రెండు చోరీలు జరిగాయి. ముక్తాపురానికి చెందిన వెంకటనారాయణరెడ్డి ఇంట్లో పది తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అదే రోజు రాత్రి మామిళ్లపల్లిలో జయరామిరెడ్డి భార్య ఆరుబయట నిద్రిస్తుండగా మెడలో ఉన్న మూడు తులాల బంగారం గొలుసును లాక్కెళ్లారు.

● చంద్రాచర్ల కొట్టాల్లో వెంకటాద్రి ఇంట్లో దొంగలు చొరబడి రూ.50లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన జరిగిన నెలలోపే అదే గ్రామంలోని రమేష్, శ్రీనివాసులు అనే అన్నదమ్ముల ఇళ్లలో రూ.65 వేలు నగదును ఎత్తుకెళ్లారు. అలాగే మామిళ్లపల్లి సాయిబాబా గుడిలో రెండు సార్లు ఆలయ తలుపులు పగలకొట్టి హుండీలోని నగదును అపహరించారు.

● రాంపురం గ్రామంలో పట్టపగలే రైతుగోపాల్ ఇంట్లోకి దూరి రూ.50వేలు నగదును ఎత్తుకెళ్లారు. ఇలా ఏదో ఒక సంఘటన మండలంలోచోటు చేసుకుంటున్నాయి.

● ముక్తాపురం గ్రామంలో వెంకటనారాయణరెడ్డికి ఇంటికి క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలను సేకరించుకుని వెళ్లారు. చంద్రాచర్ల కొట్టాలలో ఆగంతుకుడు చోరీ చేస్తున్న దృశ్యం సీసీపుటేజీలో స్పష్టంగా కనిపిస్తోంది. అయినప్పటికి చోరీ కేసులు ఛేదించడంతో పాటు దొంగతనాలను అరికట్టడంలో కనగానపల్లి పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటు న్నారు. ఇది ఇలా ఉండగా మండలంలోని కనగానపల్లి, తగరకుంట, మామిళ్లపల్లి తదితర గ్రామాల ప్రధాన వీధుల్లో పోలీసులు ఏర్పాటుచేసిన సీసీ కెమరాలు పనిచేయడం లేదు. ఇది దుండగులకు మరింత తోడ్పడుతున్నట్టు తెలుస్తోంది. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి సీసీకెమరాలను వినియోగంలోకి తెచ్చి, రాత్రిళ్ల పెట్రోలింగ్ నిర్వహిస్తే చోరీలు తగ్గుతాయని ప్రజలు కోరుతున్నారు.

పొలాలనూ వదలని దొంగలు

ఇళ్లలో చోరీలతో పాటు పంటలను కాపాడుకునేందుకు రైతులు ఏర్పాటుచేసుకున్న వ్యవసాయ ఎరికరాలను దొంగలు వదలడంలేదు. రైతుల పొలాల్లో ఉన్న స్ప్రింక్లర్ పైపులు, డ్రిప్ పరికరాలను రాత్రివేళల్లో యథేచ్ఛగా ఎత్తుకెళ్తున్నారు. స్టార్టర్ పెట్టెలు, కేబుల్ చోరీలు వరుసగా జరుగుతున్నా యి. దీంతో రైతుల పొలాల్లోనే కాపలాకాయాల్సిన పరిస్థితి నెలకొంది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై చొరవ తీసుకుని దొంగల ఆట కట్టించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చోరీలను అరికడతాం



రెండు రోజులు క్రితమే బాధ్యతలు చేపట్టాను. నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు పాటిస్తాం. శాంతి భద్రతలు కాపాడుతూనే చోరీలపై నిఘాం ఉంచుతాం. పని చేయని సీసీ కెమరాలను గుర్తించి సరిచేస్తాం. రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహిస్తాం. ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి దొంగతనాలను అరికడతాం. -మహమ్మద్ రిజ్వాన్, ఎస్ఐ, కనగానపల్లి

మహిళ ఆత్మహత్యాయత్నం

డి.హీరేహాళ్, నవంబరు 10: మండలంలోని మురడి గ్రామంలో ఆదివారం శైలజ అనే మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాల్లోకెళ్తే.. విడపనకల్లు మండలం గాజుల మల్లాపురం గ్రామానికి చెందిన శైలజ తన సొంత అక్క భర్త అయిన మురడి గ్రామానికి చెందిన గంగాధర్‌ను ప్రేమించి ఏడాది క్రితం పెళ్లి చేసుకుంది. ఇక అప్పటి నుంచి ఆమెతో పాటు ఆమె అక్క ఒకేఇంట్లో కాపురం ఉంటుండడంతో గొడవలు మొదలయ్యాయి. అక్క భర్తను పెళ్లి చేసుకోవడంతో అటు ఆమె అక్క, పుట్టింటి వాళ్లు నిత్యం బాధపడుతుండేవారు. ఇది అంతా తన వల్లే జరిగిందని మనస్తాపం చెందిన శైలజ తానే లేకపోతే ఇక సమస్య ఉండదని భావించి ఆదివారం తెల్లవారుజామున ఇంటి ఆవరణలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు మంటలను ఆర్పివేశారు. అయినా 50 శాతం పైగా ఒళ్లు కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని శైలజను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ పాఠశాలలో 2007-08 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులతో పాటు అప్పటి ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యా యులు హాజరయ్యారు. ముందుగా పాఠశాల ఉపాధ్యాయులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ... తాము విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థులు తమ ఎదుటే ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడటం తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. కష్టాల్లో ఉన్న తోటి మిత్రులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

కార్తీక దీపోత్సవం



చెరువులో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శింగనమల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ని యోజకవర్గ కేంద్రం సమీపంలోని శ్రీరంగరాయ చెరువులో భక్తులు భక్తి శ్రద్ధలతో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. కార్తీక ఆదివారం పురస్కరించుకుని స్థానిక దుర్గాంజనేయస్వామి భక్త మండలి సభ్యులు రాత్రి శింగనమల చెరువులో దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు చెరువు నీటిలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

క్లుప్తంగా..

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రభాకర్



గుంతకల్లు/గుంతకల్లుటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన దౌల్తాపురం ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం ఉత్తర్వులను జారీ చేసినట్లు ఆయన చెప్పారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో రావడం తథ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

బీజేపీ గెలుపునకు వైసీపీ ప్రచారం

రాయదుర్గం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని సండూరు నియోజకవర్గంలో శాసనసభ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కొందరు వైసీపీ నాయకులు ప్రచారానికి దిగారు. డీ.హీరేహాళ్ మండల వైసీపీ కన్వీనర్ వన్నూరుస్వామి ఎన్నికల ప్రచారంలో జోరుగా పాల్గొంటున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఇప్పటికే బీజేపీలో చేరి సండూరు ఎన్నికల ప్రచారంలో జోరుగా పాల్గొంటున్నారు. ఆయనతో పాటు డీ.హీరేహాళ్ మండలంలోని కొందరు వైసీపీ నాయకులు నిత్యం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ బీజేపీని గెలిపించాలంటూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థిస్తున్నట్లు ఫొటోలు వైరల్ అవుతున్నాయి. నియోజకవర్గంలో కొందరు వైసీపీ నాయకులు బీజేపీ నాయకుడి వెంట అనునిత్యం ఉండడం పట్ల అధిష్ఠానం ఇప్పటికే సున్నితంగా మందలించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులు బీజేపీకి మద్దతు పలుకుతూ కర్ణాటకలో ప్రచారంలో పాల్గొనడం వైసీపీ అధిష్ఠానానికి మింగుడు పడడం లేదు. దీంతో దీనిపై సమగ్ర వివరణ ఇవ్వాలని నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని కోరినట్లు తెలియవచ్చింది. బీజేపీతో కర్ణాటకలో వైసీపీ నాయకులు చెట్టాపట్టాలు వేసుకుని తిరగడం, ఆంధ్ర రాజకీయాలలో మాత్రం బద్ధ శత్రువులుగా వ్యవహరించడం లాంటి ద్వంద వైఖరి పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

15న జ్వాలాతోరణం

తాడిపత్రి, నవంబరు10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈనెల 15వ తేదీన ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో జ్వాలాతోరణం, మ్యూజికల్ డ్యాన్స్ ఈవెంట్స్, క్రాకర్స్ షో జరగనుంది. నెల్లూరుకు చెందిన మాధవ్ ఈవెంట్స్ వారిచేత ఈనెల 15న సాయంత్రం 6 నుంచి 9గంటల వరకు కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

ఎరువుల దుకాణంలో చోరీ

ఉరవకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీ థియేటర్ సమీపంలో ఉన్న మహాదేవ ఎరువుల దుకాణంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు షెట్టర్‌ను ధ్వంసం చేసి లోపలికి చొరబడ్డారని, క్యాష్ బాక్సులో ఉన్న రూ.70వేల నగదును అపహరించారని బాధితుడు రాము తెలిపారు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా.. విషయం తెలిసిందన్నారు. వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా.. క్లూస్ టీం వచ్చి చోరీ జరిగిన ప్రాంతంలో ఆధారాలను సేకరించారు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. వాటి ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఆర్అండ్ బీ గెస్ట్ హౌస్‌లోని బోరు మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకు వెళ్లారు. వరుసగా చోరీలు జరుగుతుండడంతో స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఘనంగా గురుతాత షంషేర్ ఊరేగింపు

విడపనకల్లు, నవంబరు 10: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గురుతాత ఉరుసు మహోత్సవం ఆదివారం షంషేర్ ఊరేగింపుతో ముగిసింది. దర్గాలోని గురుతాత సమాధిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్నారు. గురుతాత దర్గా వద్ద శనివారం రాత్రి ప్రారంభమైన ఖవ్వాలి ఆదివారం తెల్లవారు జామున ముగిసింది. ఖవ్వాలి అనంతరం గురుతాత స్వామి షంషేర్‌ను గుర్రంపై ఉంచి గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. షంషేర్ దర్గాను చేరుకోవటంతో ఉరుసు ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ముస్లిం జమాత్, మూడో తరం పీఠాధి పతి సిరాజ్ పీర్ ఖాద్రీ సాహెబ్, గురువులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 15లోపు ప్రీమియం చెల్లించాలి

గుత్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రబీలో టమోటా పంటను సాగు చేసిన రైతులు బీమా పరిధిలోకి రావాలంటే డిసెంబరు 15లోపు ప్రీమియం చెల్లించాలని ఉద్యానశాఖ అధికారి మిత్రనంద ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ రబీలో ఉద్యాన వన పంటలకు సంబంధించి వాతావరణ బీమా కింద టమోటా పంటను నోటిఫై చేశారన్నారు. కావున టమోటా సాగు చేసిన రైతులు ఈ క్రాప్ నమోదు చే యించడంతో పాటు ఎకరాకు రూ.1600 ప్రకారం డిసెంబరు 15లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. దీంతో ఎకరాకు రూ.32వేలు ప్రకారం బీమా వస్తుందని చెప్పారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

● భయాందోళనలో ప్రజలు

గుంతకల్లు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిని అతితక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడంతో పాటు రక్షణ కంచె కూడా వేయలేదు. దీంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా అర్అండ్‌బీ అతిథి గృహం, పీఅండ్‌టీ కాలనీ, దొండమిట్ట, గుంతబావి, అంజుమన్‌వీధి, కసాపురం రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. అతి తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడంతో ఫ్యూజ్ వైర్లు చేతికి అందేలా ఉన్నాయి. అదీగాక వాటి వద్ద చెత్తాచెదారం భారీగా పేరుకోవడంతో వాటిని తినడానికి పశువులు అక్కడి వెళ్తున్నాయి. అవి పొరపాటున ఫ్యూజ్ వైర్లకు సోకితే అంతే సంగతి. ఇక ట్రాన్స్‌ఫార్మర్లను ఆనుకుని చిరువ్యాపారులు పండ్లు, చేపల దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ వ్యాపారులు కానీ వినియోగదారులు కానీ ఏమాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా విద్యుత్ ప్రమాదానికి గురి కావాల్సిందే. అర్అండ్‌బీ అతిథి గృహం ప్రహరీని ఆనుకుని మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. అ ప్రాంతంలో నిత్యం రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచాలని, అలాగే చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



పీఅండ్‌టీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పేరుకున్న చెత్తచెదారం



ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద అతితక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్

రక్షణ వలయాల ఏర్పాటుకు చర్యలు

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్తచెదారం తొలగిస్తాం. తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచుతాం. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ వలయాలు ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటాం.

- నాగేంద్ర, విద్యుత్ ఏడీఈ

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



యాడికి హైస్కూల్‌లో పూర్వవిద్యార్థులు



కూడేరులో ..

యాడికి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. అదే పాఠశాలలో 1980-81వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సుమారు 43 ఏళ్ల తర్వాత అందరూ ఒక్కచోట కలుసుకున్నారు. దీంతో వారి ఆనందాలకు అవదులు లేవు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి గురువులు భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కేశవరెడ్డి, శేషప్పను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పూర్వవిద్యార్థులు కులశేఖర్‌రెడ్డి, మురళీకృష్ణ, ధృవనారాయణ, షణ్ముఖరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కంబగిరి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 1990-1991 వ విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు సుమారు 34 ఏళ్ల తర్వాత ఒక్కటిగా కలుసుకున్నారు. అదే పాఠశాలలో వారు పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించి అందరూ కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ గురువులను శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. అందరూ సాయంత్రం దాకా అక్కడే ఆనందంగా గడిపారు.

ఆలయానికి వెండి సామగ్రి అందజేత

గుంతకల్లుటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి ఆదివారం పట్టణానికి చెందిన భక్తుడు వెండి చెంబు, వెండి పళ్లెంను సమర్పించారు. ఎస్.లక్ష్మీనారాయణ అనే భక్తుడు 985గ్రాముల వెండితో చెంబు, పళ్లెంను తయారు చేయించి ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతకు అర్చకులు స్వామివారి దర్శనం చేయించి పూజలు, అర్చనలు జరిపించి తీర్థప్రసాదాలు అందజేశారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

పెద్దవడుగూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిడుతూరు గ్రామంలోని టీడీపీ సీనియర్ నాయకుడు రాధాకృష్ణారెడ్డి (75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆగ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ సీనియర్ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, రమేష్‌యాదవ్ ఉన్నారు.

విద్యార్థులకు పోటీలు

కుందుర్పి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బాలల పండుగ ప్రతిభా పోటీలు జరిగాయి. ఇందులో మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన 320 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉపన్యాసం, పద్యం చెప్పటం, కథలు చెప్పడం, చిత్రలేఖనం, మట్టితో బొమ్మలు తయారు చేయడం లాంటి పోటీలను నిర్వహించారు. విజేతలకు బాలల దినోత్స వం రోజున బహుమతులు అందించనున్నారు. ట్రస్టు నిర్వాహకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు, కల్వర్టు పనులు ప్రారంభం

బొమ్మనహాళ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురైన బండూరు, కల్లుదేవనహళ్లి గ్రామాల రోడ్డు, కల్వర్టుకు మరమ్మతు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రూ. 40లక్షల వ్యయంతో పనులకు ప్రతిపాదన పంపించారు. దీంతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు.

మడ్డిపల్లిలో డీఎస్పీ విచారణ

పుట్లూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో వారం క్రితం అరటితోటలో దొంగతనాలు, మూడునెలల క్రితం ఓ మహిళ అనుమానాస్పద మృతిపై ఆదివారం డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారించారు. ఈ సందర్భంగా ఆయన అరటితోటల్లో పర్యటించి రైతులతో మాటాడారు. చోరీలపై అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బయటి వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం మహిళ మృతి కేసులో కుటుంబ సభ్యులను విచారించారు. ఆయన వెంట సీఐ సత్యబాబు, సిబ్బంది గోవిందరాజులు ఉన్నారు.

కేబుల్ చోరీలపై పోలీసుల ఆరా

యాడికి: వ్యవసాయ పొలాల్లో కేబుల్ చోరీలపై వివరాలను ఆదివారం సీఐ ఈరన్న బాధిత రైతులతో ఆరాతీశారు. చెలరేగిపోతున్న దొంగలు.. పట్టించుకోని పోలీసులు.. పొలాల్లో నిత్యం కేబుల్‌వైర్ల చోరీ అనే శీర్షికన ఈ నెల 9న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సీఐ కేబుల్ చోరీ అయిన పలువురు రైతుల పొలాలను పరిశీలించారు. ఎవరెవరి పొలాల్లో కేబుల్ ఏ మేరకు చోరీ అయిందనే వివరాలను ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ పొలాల్లో కేబుల్ చోరీలపై ఇప్పటి నుంచి ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల పర్యటన

యల్లనూరు: మండలంలోని సమస్యాత్మకమైన గొడ్డుమర్రి, బుక్కాపురం, తిమ్మంపల్లి గ్రామాల్లో పోలీసులు పర్యటించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ సత్యబాబు పర్యటించి గ్రామ పరిస్థితులపై ఆరాతీశారు. అనంతరం రౌడీషీటర్లు, ఫ్యాక్షన్ నాయకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ రాంప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

పులకుర్తిలో మహిళ ఆత్మహత్య

డీ .హీరేహాళ్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులకుర్తిలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పులకుర్తి గ్రామానికి చెందిన గవిసిద్ధకు ఐదేళ్ల క్రితం కర్ణాటక సండూరు తాలూకా రాజాపురం గ్రామానికి చెందిన కావేరితో వివాహం జరిగింది. వీరు కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. మూడురోజులుగా భార్య, భర్తలు గొడవ పడున్నారు. ఈ క్రమంలో కావేరి తీవ్ర మనస్థాపానికి గురైంది. ఆదివారం తెల్లవారుజామున భర్త బహిర్భూమికి బయటకి వెళ్లగా ఆమె ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త వచ్చి చూసి ఆమెను కిందకు దించి చూడగా.. అప్పటికే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురడిలో ఆత్మహత్యాయత్నం ..

డీ .హీరేహాళ్: మండలంలోని మురడి గ్రామంలో ఆదివారం శైలజ అనే మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాల్లోకెళ్తే.. విడపనకల్లు మండలం గాజుల మల్లాపురం గ్రామానికి చెందిన శైలజ తన సొంత అక్క భర్త అయిన మురడి గ్రామానికి చెందిన గంగాధర్‌ను ప్రేమించి ఏడాది క్రితం పెళ్లి చేసుకుంది. ఇక అప్పటి నుంచి ఆమెతో పాటు ఆమె అక్క ఒకేఇంట్లో కాపురం ఉంటుండడంతో గొడవలు మొదలయ్యాయి. అక్క భర్తను పెళ్లి చేసుకోవడంతో అటు ఆమె అక్క, పుట్టింటివాళ్లు నిత్యం బాధపడుతుండేవారు. ఇది అంతా తన వల్లే జరిగిందని మనస్థాపం చెందిన శైలజ తానే లేకపోతే ఇక సమస్య ఉండదని భావించి ఆదివారం తెల్లవారుజామున ఇంటి ఆవరణలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు మంటలను ఆర్పివేశారు. అయినా 50 శాతం పైగా ఒళ్లు కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని శైలజను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం నియోజకవర్గంలో రెండు చోట్ల దాడులు చేసి కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నారు. రాయదుర్గం పట్టణంలోని పోలిమారమ్మ ఆలయం వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనాన్ని వదిలి పారిపోయాడని, . వెళ్లి వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 192 బాటిళ్ల కర్ణాటక మద్యం వున్నట్లు గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకని వాహనాన్ని సీజ్‌చేశామని ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణ, ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. బొమ్మనహాళ్ మండలం గోవిందవాడలో హుసేన్ సాబ్ అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం అందడంతో దాడులు చేసి 110 టెట్రాప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం హుసేన్‌సాబ్‌ను అరెస్టు చేసి కేసునమోదు చేశామన్నారు.

యాడికి: మండలంలోని గుడిపాడు గ్రామసమీపంలో కర్ణాటకకు చెందిన 60 మద్యం (టెట్రా) ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటరమణయ్య తెలిపారు. గుడిపాడు గ్రామసమీపాన అమర్‌నాథ్‌రెడ్డి అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడిచేసినట్లు చెప్పారు. అమరనాథ్‌రెడ్డిని అరెస్టు చేసి, అతడి నుంచి 60 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి మండల కేంద్రంలోని కుంటలో పేకాట ఆడుతున్న ముగ్గురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటరమణయ్య తెలిపారు. అలాగే వారివద్ద నుంచి రూ.1100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కమ్మ సేవా సంఘం మండల కమిటీ ఎన్నిక

గుత్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మన్రోసత్రంలో ఆదివారం కమ్మ సేవా సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. సంఘం సమావేశం ఏర్పాటు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపినేటి సురేంద్రనాయుడు, గౌరవాధ్యక్షుడిగా పయ్యావుల కేశన్న, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున నాయుడు, ఉపాధ్యక్షులుగా యంగన్నపల్లి భరత్‌కుమార్, గూడూరు నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, సహాయకార్యదర్శిగా గిరిప్రసాద్‌నాయుడు, కోశాధికారిగా పీ.రమేష్‌ను ఎన్నుకున్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

బెళుగుప్ప, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వరసిద్ధి వినాయక ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కేరళకు చెందిన అర్చకులు పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ నెల 13వ తేదీన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.


విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం

రాయదుర్గంరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన విద్యార్థి గౌతమ్ చికిత్సకు పోలీసుశాఖ తరపున అర్బన్ సీఐ జయనాయక్, ఎస్ఐ బాలరాజు ఆదివారం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభాకర్, శైలజ దంపతుల కుమారుడు గౌతమ్ రెండోతరగతి చదువుతున్నాడు. కాగా తీవ్రఅనారోగ్య భారిన పడడంతో అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో సీఐ జయనాయక్ స్పందించి విద్యార్థి వైద్యానికి రూ. 10 వేలు ఆర్థికసాయం అందించారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు ఘన నివాళి

గుంతకల్లుటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఆదివారం పీడితప్రజలు ఉద్యమ కారుడు, ప్రొఫెసర్ జీఎన్. సాయిబాబా సంస్మరణ సభను ప్రజా సంఘాల నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత పలువురు మాట్లాడుతూ సాయిబాబా ఎన్నో ప్రజా ఉద్యమాలు నడిపారన్నారు. ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా జాతీయ, అంతర్జాతీయ సదస్సులను పెట్టి మరణించే వరకు ప్రచారం చేశారని కొనియాడారు కార్యక్రమంలో సిటిజన్ ప్రొగ్రెసెస్ ఫోరం కార్యదర్శి తారకేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఓపీడీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, ఏపీ సీఎల్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, సంచార జాతుల రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల కార్యదర్శి స్వామిదాసు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, సీఐటీయూ పట్టణ కార్యదర్శి కసాపురం రమేష్, డీవైఎఫ్ఐ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు



లత్తవరం ఉమామహేశ్వర ఆశ్రమంలో వన భోజనాలు చేస్తున్న మహిళలు

ఉరవకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిలత్తవరం ఉమామహేశ్వర ఆశ్రమంలో ఆదివారం కార్తీక శోభ సంతరించుకుంది. ప్రతియేటా కార్తీక మాసం లో ఇక్కడ వన భోజనాలను చేయడం ఆనవాయితీది. ప్రజలు పెద్దఎత్తున ఆశ్రమంలోని చంద్రమౌళీశ్వర, శంకరానంద గిరి స్వామి వార్ల ఆలయాలను దర్శించుకుని పూజలను నిర్వహించి దీపాలను వెలిగించారు. అనంతరం ఉసిరి చెట్ల కింద వనభోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పిల్లాపాపలతో ఆనందంగా గడిపారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వివేకానంద పార్కులో బలిజలు కార్తీక మాస వనభోజనాలను నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేత గుమ్మనూరు నారాయణస్వామి పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు తలారిమస్తానప్ప, గుమ్మనూరు వెంకటేష్, జనసేన నాయకుడు వాసగిరి మణికంత, బలిజకులస్థులు గాజుల రఘు, రంగారాయల్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.